ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 13 జనవరి 2024


పూర్తయిన ఇంటితో లక్ష్మీదేవి

జగనన్న కాలనీలో దొంగలు పడ్డారు

జగనన్న కాలనీలో దొంగలు పడ్డారు. కాలనీలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించే సిమెంట్, కడ్డీలను కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శించి బ్లాక్‌లో అమ్మేశారనే ఆరోపణలు ఉన్నాయి. 'ఎవరు ఏమనుకుంటే మాకేంటి.. మా సంపాదనే ముఖ్యం' అన్న రీతిలో కాలనీని దోచేస్తున్నారు. లబ్ధిదారులకు ఇవ్వాల్సినవి మూడో కంటికి తెలియకుండా విక్రయించి, జేబులు నింపుకుంటూ.. మూడుపువ్వులు ఆరు కాయలుగా ఉద్యోగం వెలగబెడుతున్నారు. ఒకవేళ ఎలాగోలా ఇల్లు నిర్మించుకున్నా.. వారికి బిల్లులు మంజూరు చేయకుండా నరకం చూపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అసలేం జరగనట్లు, ఏమీ తెలియనట్లు సంబంధిత అధికారులు ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి తీరుతో పేదవాడికి గూడు కల్పించాలన్న ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది.


సుధాకర్ ఇల్లు


- కడ్డీలు మింగేశారు.. సిమెంట్ అమ్మేశారు
- ప్రేక్షక పాత్రలో జిల్లా యంత్రాంగం
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

జగనన్న కాలనీ

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 12: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నవరత్నాల్లో భాగంగా ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు కట్టివ్వాలనే ఆశయంతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా జిల్లాకు 74,514 ఇళ్లు మంజూరు చేశారు. రాయచోటి జిల్లా కేంద్రంలోని నారాయణరెడ్డిగారి పల్లె దగ్గర దాదాపు 6745 వేల ఇళ్లు కట్టించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం దాదాపు 270 ఎకరాలలో లేఅవుట్ వేసి లబ్ధిదారులకు స్థలాలు కేటాయించడంతో కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. ఇక్కడ ఇళ్లు పూర్తి చేసిన దాదాపు 40 శాతం మంది లబ్ధిదారులకు సమయానికి బిల్లులు, మెటీరియల్ ఇవ్వకుండా నెలల తరబడి హౌసింగ్ అధికారులు నరకం చూపిస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. హౌసింగ్ అధికారుల తీరుతో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన నడుస్తున్నాయని లబ్ధిదారులు బహిరంగంగానే చెబుతున్నారు. ఈ కాలనీ ప్రారంభించి నాలుగేళ్లయినా ఇప్పటి వరకు 745 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు జరగడం ఇందుకు నిదర్శనం. అధికారుల అలసత్వమో, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమో తెలియదు కానీ జగనన్న కాలనీలో కొన్ని ఇళ్లు పునాదులకే పరిమితమయ్యాయి. కొన్ని స్లాబ్ లెవల్‌కు పూర్తయినా వాటి బిల్లులు మంజూరు చేయకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. కాలనీలోకి జిల్లా అధికారులు వచ్చినప్పుడు హడావుడి చేసే హౌసింగ్ సిబ్బంది.. తరువాత కనుచూపు మేర ఉండరని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఇప్పటి వరకు జిల్లాకు ఐరన్ 18,47,70,046 కేజీలు రాగా అందులో 15,27,81,749 కేజీలు లబ్ధిదారులకు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాకు సిమెంట్ బస్తాలు 28,33,914 రాగా, 27,85,330 బస్తాలు లబ్ధిదారులకు ఇచ్చినట్లు లెక్కలున్నాయి. ఈ కాలనీలో పనిచేస్తున్న హౌసింగ్ సిబ్బంది ఇళ్ల నిర్మాణాలను ఆదాయ వనరులుగా మార్చుకున్నారని, కేవలం ఇసుక పంపిణీలోనే భారీగా అక్రమాలు జరిగాయని సోషల్ మీడియాలో నెల రోజులుగా హల్‌చల్ చేస్తోందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదే విషయమై అక్కడ పనిచేస్తున్న ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు జిల్లా హౌసింగ్ కార్యాలయంలో ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకోవడంతో పాటు, ఒకరు ఏకంగా ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన అక్కడున్న వారిని భయభ్రాంతులకు గురిచేసింది. ఈ సంఘటనపై అప్పట్లో హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ మీడియాతో మాట్లాడుతూ ఇరువురు వర్క్ ఇన్‌స్పెక్టర్లను, ఒక ఏఈని బదిలీ చేస్తున్నానని చెప్పి దాదాపు రెండు వారాలు కావస్తున్నా ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలున్నాయి. కాగా ఈ విషయంపై విజిలెన్స్ అధికారులు జిల్లా హౌసింగ్ కార్యాలయంలో రికార్డులు తనిఖీలు చేసి ఏమీ తేల్చలేకపోయారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జగనన్న కాలనీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలికితీసి, సిమెంట్, కడ్డీలు, ఇసుకలో అవినీతికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఇల్లు పూర్తి చేసినా బిల్లులు ఇవ్వలేదు..

మూడు నెలల క్రితమే నా ఇంటి నిర్మాణం పూర్తి చేశాను. అయినప్పటికీ బిల్లులు రావాల్సి ఉంది. నా ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రూ.1.40 లక్షలు, 4 ట్రిప్పులు ఇసుక, 10 కడ్డీలు మాత్రమే ఇచ్చారు. సిమెంట్ అడిగితే హౌసింగ్ వారు సచివాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోమని చెబుతున్నారు. అక్కడికి వెళ్లి అడిగితే వారు హౌసింగ్ అధికారుల దగ్గర తీసుకోమని ఉచిత సలహా ఇస్తున్నారు. మేము ఇల్లు నిర్మాణం చేసేటప్పుడు సిమెంట్ బ్లాక్‌లో కొనుక్కున్నాం. ఈ కాలనీలో చాలా మందికి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోకపోయినా సిమెంట్ అడిగినంత ఇస్తున్నట్లు తెలిసింది. ఈ కాలనీలో ఇసుక మాఫియా నడుస్తోంది.

- లక్ష్మీదేవి, జగనన్న కాలనీ, రాయచోటి



సిమెంట్ బ్లాకులో అమ్మేస్తున్నారు..

నాకు జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు చేశారు. అయితే నాకు సిమెంట్ సకాలంలో ఇవ్వకపోతే బ్లాకులో కొనుక్కున్నాను. ఈ కాలనీకి వచ్చిన సిమెంట్‌ను హౌసింగ్ అధికారులు బ్లాకులో అమ్ముకుంటున్నారు. ఇక్కడ ఉన్న ఇసుక రాత్రింబవళ్లు అమ్మేసుకుంటున్నారు. జిల్లా అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ కాలనీలో 40 శాతం హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయి. ఈ విషయాలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తాను.

- సుధాకర్, జగనన్న కాలనీ, రాయచోటి

ఈ వ్యవహారం నా దృష్టికి వచ్చింది..

గత కొంతకాలంగా ఇసుక, సిమెంట్ పక్కదారి పట్టిందన్న విషయం నా దృష్టికి వచ్చింది. ఆన్‌లైన్‌లో సిమెంట్ బుక్ చేసుకున్న వారికి సమయానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటాము. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తపడతాం.

- చంద్రశేఖర్, హౌసింగ్ డీఈ


సంప్రదాయ వస్త్రధారణలో ఆర్డీవో మురళి, అధికారులు, పురప్రముఖులు

మదనపల్లెలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

- సంప్రదాయ దుస్తులు.. గంగిరెద్దులు, బోగిమంటలు, హరిదాసులతో పండుగ శోభ


బోగిమంట చుట్టూ పూలతో ముగ్గులు వేసి అలంకరించిన దృశ్యం

మదనపల్లెటౌన్, జనవరి 12: సంక్రాంతి పండుగ అంటేనే చిన్నా, పెద్ద అందరూ ఉత్సాహంగా జరుపుకునే పెద్దపండుగ. వేల మైళ్ల దూరంలో వున్నా సంక్రాంతికి సొంత ఊరు చేరుకుని సంబరాలు చేసుకునే సాంప్రదాయం అనాదిగా వస్తోంది. ఇలాంటి పండుగ విశిష్టత, సంప్రదాయాలను భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా చేయాలని మదనపల్లెలో ఆర్డీవో మురళి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జడ్పీ హైస్కూల్లో దాతల సహాయ, సహకారాలతో, స్వచ్ఛంద సంస్థలు, పుర ప్రముఖులు సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించారు. మైదానం నలువైపులా నాలుగు వేదికలు ఏర్పాటు చేసి హరిదాసుచే హరికథలు, మరో వేదికపై వరాల ఆంజనేయస్వామి, సీతారాములు ఉట్టిపడేలా తాత్కాలిక ఆలయం, మరో వేదికపై సాంప్రదాయ నృత్యాలు, లంబాడీల నృత్యాలు, చిన్నారులచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించారు. దీంతో పాటు మైదానం నలువైపులా కోలాటాలు, చెక్కభజనలు చేస్తూ కళాకారులు ప్రజలను ఆకట్టుకున్నారు. వీటితో పాటు గంగిరెద్దులు, దేవరెద్దులు ప్రదర్శించారు. ఆర్డీవో మురళి, అరుణ దంపతులు మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే ప్రజల్లో కొత్త ఉత్సాహం వస్తుందని, అలాంటి పండుగను మదనపల్లెలో ముందస్తుగా జరుపుకోవడం సంతోషంగా వుందన్నారు. అనంతరం ఆహుతులకు బెల్లంతో చేసిన పిండివంటలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరేట్ డీఏవో శేషయ్య, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఎల్‌డీవో లక్ష్మీపతి, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, వీఎస్ఆర్ గ్రాండ్ అధినేత వి.సుధాకర్‌రెడ్డి, శేఖర్ స్వీట్‌స్టాల్ యజమాని శేఖర్, పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.


ముందస్తు సంక్రాంతి వేడుకల్లో గంగిరెద్దులు

వైసీపీ.. ప్రజాభిమానాన్ని కోల్పోయింది

- బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్
- అట్టహాసంగా బీజేపీ కార్యాలయం ప్రారంభం



సభలో ప్రసంగిస్తున్న సత్యకుమార్

రైల్వేకోడూరు, జనవరి 12: వైసీపీ ప్రభుత్వం ప్రజాభిమానాన్ని కోల్పోయిందని బీజేపీ జాతీయ కార్యదర్శి, అండమాన్ నికోబార్ ఇన్‌చార్జ్, ఉత్తరప్రదేశ్ సహ ఇన్‌చార్జ్ వై.సత్యకుమార్ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని మైసూరివారిపల్లె ప్రధానదారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ అరాచకాలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలతో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసిందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కబ్జాల పర్వంగా మంత్రులు, ఎమ్మెల్యేలు పనిచేస్తున్నారని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు వందలాది ఎకరాలను కబ్జా చేశారని ఆరోపించారు. తిరుపతిలోని స్విమ్స్‌కు సంబంధించిన వాటాదారుల ద్వారా వైవీ సుబ్బారెడ్డి కుమారుడు రూ.50 లక్షలకు పైగా ఆదాయాన్ని పొందుతున్నారని విమర్శించారు. శిల్పారామంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమార్తె నెలకు రూ.12 లక్షలు ఆదాయాన్ని పొందుతోందని, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శేషాచల అడవులను దోచుకు తింటున్నారని విమర్శించారు. ఈ విషయాలన్నీ ఏపీ ప్రజలు గమనించాలన్నారు. రానున్న రోజుల్లో జగన్ మాజీ సీఎంగా మిగిలిపోతారన్నారు. మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకాలు మితిమీరిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూహక్కు చట్టం వైసీపీ నాయకులు, కార్యకర్తలకు మేలు చేస్తుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు జగన్ బొమ్మ పెట్టుకుంటున్నారు. బీజేపీ అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమ్మెల్యేల కబ్జాలు, కుంభకోణాలు, అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని చూసి ప్రజలు విసిగిపోయారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు, బీజేపీ రైల్వేకోడూరు అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చంగల్రాజు, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు దాసర్రాజు జయప్రకాష్ నారాయణవర్మ, బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ చంద్రమౌళి, మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, స్థానిక నాయకులు చక్రవర్తుల నాగేశ్వర్‌రాజు, వాకచర్ల సుబ్బారావు, గౌరీకుమార్, జోగినేని సుబ్బారావు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూటా.. పస్తులేనా ?

- 32వ రోజు అంగన్వాడీల నిరసన

రాయచోటి/ రాజంపేట/ మదనపల్లె, జనవరి 12: సంక్రాంతి పండుగ పూట తమకు పస్తులేనా అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం 32వ రోజు నిరవధిక సమ్మెలో వారు పాల్గొన్నారు. ఇందులో భాగంగా రాయచోటి కలెక్టరేట్ వద్ద మెడకు పైట కొంగులతో ఉరివేసుకొని నిరసన తెలపగా, రాజంపేటలో 32వ నెంబరు ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. ఇక మదనపల్లెలోని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


రాజంపేటలో 32వ నెంబరు ఆకారంలో కూర్చొని నిరసన తెల్పుతున్న అంగన్వాడీలు

అత్తగారింటికి వెళ్తూ.. నవదంపతుల మృతి

- ఆటోను ఢీకొన్న లారీ
- కాళ్ల పారాణి ఆరకముందే మృత్యుఒడిలోకి
- ఆరు నెలల కిందటే వివాహం
- పండగ పూట విషాదం


సంఘటనా స్థలం వద్ద భార్యభర్తల మృతదేహాలు


భార్గవ్, లక్ష్మీదేవి (ఫైల్)

సంక్రాంతికి నవదంపతులు ఊరెళదామనుకున్నారు. అందుకు కావాల్సిన నూతన దుస్తులు, తదితరవి కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్నారు. వివాహమైన తర్వాత మొదటి పండక్కి తన అమ్మగారింటికి వెళ్తున్నామన్న సంతోషంలో ఆ వధువు ఉబ్బితబ్బిబ్బయింది. కానీ ఇంతలోనే వారిని విధి వక్రీకరించింది. కాళ్ల పారాణి ఆరకముందే మృత్యుఒడికి చేర్చింది. ఆటోలో వెళ్తున్న వీరిని లారీ రూపంలో మృత్యువు వెంటాడింది. వివాహమై ఆరు నెలలు కాకముందే ఈ ఘోరం జరగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరై విలపించారు. ఎటువంటి అచ్చటా.. ముచ్చటా.. తీరకముందే ఇలా జరిగిందేమిటి దేవుడా అని గుండెలు పగిలేలా ఏడ్చారు.

రైల్వేకోడూరు, జనవరి 12: మండలంలోని రాఘవరాజపురం గ్రామం ప్రధానదారిలో శుక్రవారం బోరు పైపులను తీసుకెళ్తున్న లారీ ఆటోను ఢీ కొనడంతో నవదంపతులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పెనగలూరు మండలంలోని వెలగచర్ల దళితవాడ గ్రామానికి చెందిన ఉదయగిరి భార్గవ్ (24)తో రాజంపేటకు చెందిన లక్ష్మీదేవి (28)కి 5 నెలల కిందట వివాహమైంది. వీరు ప్రస్తుతం రైల్వేకోడూరులో నివాసం ఉంటున్నారు. భార్గవ్ ఒక పెట్రోల్ బంకులో పనిచేస్తూ, ఖాళీ సమయంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రైల్వేకోడూరు నుంచి భార్గవ్ తన సొంత ఆటోలో ఫ్రిజ్, తదితర సామాన్లు తీసుకుని రాజంపేటలోని తన అత్త ఇంటికి భార్యతో సహా పండుగకు వెళ్తుండగా రాఘవరాజపురం ప్రధానదారిలో రాజంపేట నుంచి రైల్వేకోడూరుకు బోరు పైపుల లోడుతో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఆటో నుజ్జునుజ్జయి ఇరువురు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐ-1 డాక్టర్ నాయక్‌లు తమ సిబ్బందితో వచ్చి మృతదేహాలను పరిశీలించారు. వెంటనే శవపరీక్ష నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు హుటాహుటిన రాఘవరాజపురానికి చేరుకున్నారు. ఎటువంటి అచ్చటా.. ముచ్చటా.. తీరకుండానే ఇలా జరిగిందేంటి అని బోరున విలపించారు. భార్గవ్ తల్లి లక్ష్మీదేవి దుఃఖసాగరంలో మునిగిపోయింది. పెనగలూరు మండలంలోని వెలగచర్ల దళితవాడ, రాజంపేట మండలంలోని బలిజపల్లెలో పండుగపూట విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కావడంతో పోలీసులు లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

పోలింగ్ కేంద్రాల్లో వందశాతం సౌకర్యాలు కల్పించాలి

- ఎన్నికలపై సెక్టోరల్ అధికారులకు శిక్షణ ఇవ్వాలి
- కలెక్టర్ పీఎస్ గిరీషా

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 12: జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో వందశాతం కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పీఎస్ గిరీషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల ఏర్పాటు, ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ ఈఆర్‌వోలు, ఆర్‌డబ్ల్యుఎస్, స్కూల్ అండ్ కాలేజ్ ఎడ్యుకేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1607 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, ర్యాంపులు, నీటి వసతి, మరుగుదొడ్డి, ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యం, లైటింగ్ పరికరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇందులో ఈఆర్‌వోలు ఇచ్చిన నివేదిక మేరకు ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు 259, తాగునీరు 87, నీటి వసతితో మరుగుదొడ్లు 118, ఫర్నీచర్ ఏర్పాటు 204, విద్యుత్ సౌకర్యం 64, లైటింగ్ పరికరాలు 83 పీఎస్‌లలో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈఆర్‌వోలు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి ఈ నెల 25లోగా వందశాతం పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను మరొకసారి క్షుణ్ణంగా తనిఖీ చేసి ఇంకనూ కనీస సౌకర్యాలను కల్పించాల్సిన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. ఈ నెల 25 తర్వాత ఎన్నికల నిర్వహణపై సెక్టారుల అధికారులకు శిక్షణ ఏర్పాటు చేయాలని ఈఆర్‌వోలకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ, ఆర్డీవోలు రంగస్వామి, మురళి, రామక్రిష్ణారెడ్డి, పీలేరు, తంబళ్లపల్లె, రైల్వేకోడూరు ఈఆర్‌వోలు గోపాలకృష్ణ, రాఘవేంద్ర, మల్లికార్జునరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, డీఈవో శ్రీరామ్‌పురుషోత్తం, పీఆర్ ఎస్ఈ దయాకర్‌రెడ్డి, ఎస్ఎస్ఏ జిల్లా కోఆర్డినేటర్ కరుణాకర్, ఇంటర్మీడియట్ ఆర్ఐవో కృష్ణయ్య, విద్యుత్, ఆర్‌అండ్‌బీ డీఈలు చంద్రశేఖర్‌రెడ్డి, సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పీఎస్ గిరీషా

మూడేళ్లలో రూపాయి పని చేయలేదు

- వార్డుల వారీగా బడ్జెట్ ప్రకటించాలి
- బడ్జెట్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్ల డిమాండ్
- సమావేశంలో వాగ్వివాదం

మదనపల్లె, జనవరి 12: మూడేళ్ల పాలకవర్గంలో తమ వార్డుల్లో ఒక్క రూపాయి పనికూడా చేయలేదని, వార్డువారీగా బడ్జెట్ ప్రకటించాలని అధికార వైసీపీ కౌన్సిలర్లు పి.రాజేశ్, పి.ప్రసాద్‌బాబు, వై.గిరిజాలు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. కాగా కౌన్సిలర్ల మధ్య మాటామాటా పెరిగి వాగ్వివాదానికి దారితీసింది.

సమావేశం ఎలా మొదలైందంటే.. మొదటగా కమిషనర్ కె.ప్రమీల ఏఏ పద్దులకు ఎంతెంత నిధులు కేటాయించారు ? 2023-24 సవరించిన బడ్జెట్, 2024-25 అంచనా బడ్జెట్, ఆదాయ, ఖర్చుల వివరాలను చదివి కౌన్సిలర్లకు వివరించారు. కౌన్సిలర్ రాజేశ్ మాట్లాడుతూ తనవార్డులో ఎక్కువగా కమర్షియల్ ట్యాక్సు చెల్లించేవారే ఉన్నారని, వారు మున్సిపాలిటీకి చెల్లిస్తున్న పన్నుల్లో కనీసం వారి సంక్షేమ, అభివృద్ధికి ఖర్చు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరవ వార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా.. అవి ఖర్చు చేయడం లేదని, ఇతర వాటికి మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. 23వ వార్డు కౌన్సిలర్ వై.గిరిజా మాట్లాడుతూ తమ వార్డులో అభివృద్ధే లేకపోగా, ఉన్న కాలువలు ధ్వంసమై, మురికినీరు ఇళ్లలోకి వస్తున్నా.. పట్టించుకోలేదన్నారు. అధికార పార్టీకే చెందిన మరో కౌన్సిలర్ నాగార్జునబాబు మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వంలో వార్డుకు రూ.20 లక్షలు ఇస్తామన్నా.. రూపాయి ఇవ్వలేదన్నారు. కౌన్సిలర్ బి.ఎ.ఖాజా, తొమ్మిదోవార్డు కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్‌లు వారి సమస్యలను వివరించారు. 2023-24 సవరించిన బడ్జెట్ అంచనాలో అంత్యనిల్వ రూ.94.80 కోట్లు కాగా, 2024-25 నాటికి మున్సిపల్ బడ్జెట్ రూ.99.71 కోట్లుగా అంచనా వేశారు. దీనికి కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ ఆమోదం తెలిపింది.


వాగ్వాదం చేసుకుంటున్న కౌన్సిలర్లు పి.రాజేశ్, రామకృష్ణారెడ్డి

నీవెంతంటే నీవెంత..!: బడ్జెట్ అజెండాపై చర్చ జరుగుతుండగా, అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య ఏర్పడిన వివాదం సభలో పెద్దదుమారమే లేపింది. నీవెంతంటే నీవెంత ? అంటూ ఒకరిపై మరొకరు వాగ్వాదానికి దిగారు. సమావేశం చివరలో కౌన్సిలర్ బి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఇది కేవలం బడ్జెట్ సమావేశమేనని, ఇందులో బడ్జెట్‌పై మాత్రమే మాట్లాడాలని సూచించారు. అంతలో కౌన్సిలర్ రాజేశ్ కలుగజేసుకున్నారు. నీకు సమస్యలు లేకుంటే గమ్మున కూర్చోవాలనడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదం చోటు చేసుకుంది. తోటి కౌన్సిలర్లు వారిని సద్దుమణిచారు.

జనరల్ స్టోర్స్‌పై విజిలెన్స్ దాడులు

● రూ.50వేలు జరిమానా

కడప (క్రైం), జనవరి 12 : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు ప్రాంతంలోని జనరల్ స్టోర్స్‌లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి షేక్ మసూంబాషా ఆదేశాల మేరకు శుక్రవారం రైల్వేకోడూరులో గల పద్మప్రియ జనరల్ స్టోర్స్, లక్ష్మీనరసింహ జనరల్ స్టోర్స్, ఎంవీఎస్ జనరల్ స్టోర్స్‌లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ప్యాకింగ్ డిక్లరేషన్స్ అంటే ఎమ్మార్పీ లేకుండా మ్యానుఫ్యాక్చరింగ్ తేదీ, ఎక్స్‌పైరీ తేదీ పాటించని, తూకాల్లో గల తేడాలు గుర్తించి ఆయా స్టోర్లపై 3 కేసులు నమోదు చేసి సుమారు రూ.50వేలు జరిమానా విధించినట్లు వారు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రెడ్డెప్ప, ఇ.బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసరు రవీంద్రరెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టరు రెడ్డిప్రసాద్, రైల్వేకోడూరు సీఎస్‌డీటీ, విజిలెన్స్ సిబ్బంది పి.సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితులు అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న సీఐ, ఎస్ఐలు

ఓబులవారిపల్లె, జనవరి 2: మండల పరిధిలో బుధవారం సాయంత్రం జరిగిన హత్యకేసులో నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రైల్వేకోడూరు సీఐ మధుసూదన్‌రెడ్డి, ఓబులవారిపల్లె ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. జనవరి 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల సమయంలో ఓబులవారిపల్లె గ్రామ పంచాయతీ గాదెల వెళ్లే రోడ్డులో టీ బంకు వద్ద కటికంవారిపల్లె బలిజపల్లెకు చెందిన కటికం సంటప్పగారి చెంగయ్య (47) హత్యకు గురయ్యాడు. శివశంకరాపురానికి చెందిన మాదం సిద్దు మచ్చు కత్తితో నరికినట్లు మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జనవరి 12వ తేదీ ఉదయం 10.30 గంటలకు చిన్నఓరంపాడు హైవేలో డాబా వద్ద ఉన్న నిందితుడు మాదం సిద్దును అతనికి సహకరించిన అరిగెల వెంకటయ్యను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి.. రైల్వేకోడూరు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్టు



కడప (క్రైం), జనవరి 12: కడప నగరం ఆర్‌కేనగర్ సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్న 8 మందిని అరెస్టు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ నారాయణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ఆర్‌కే నగర్‌కు చెందిన ఎనిమిది మంది కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సీఐ రామచంద్ర ఆదేశాల మేరకు సిబ్బందితో దాడులు చేసి 8 మందిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి ఐదు కోళ్లు, రూ.6770 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మట్కా బీటరు అరెస్టు

కడప నగరం పాతబస్టాండు సమీపంలో శుక్రవారం మట్కా రాస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి తెలిపారు. కడపకు చెందిన షేక్ మస్తాన్‌వలి పండ్ల వ్యాపారం చేస్తూ మట్కా నిర్వహిస్తుండగా అరెస్టు చేసి.. రూ.2050 నగదు, మట్కా స్లిప్పులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

లారీ ఢీ.. చిరు వ్యాపారి మృతి



ఎర్రగుంట్ల, జనవరి 12: ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలిలో అరటిపండ్ల వ్యాపారి దస్తగిరి (67) టిప్పర్ ఢీకొన్న సంఘటనలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం దస్తగిరి సైకిల్‌లో తన అరటిపండ్ల తోపుడు బండి వద్దకు వెళుతున్నాడు. నాలుగురోడ్ల వద్ద రోడ్డు క్రాస్‌చేస్తుండగా ముద్దనూరు వైపు నుంచి ప్రొద్దుటూరు వైపు వెళుతున్న టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



కడప (క్రైం), జనవరి 12: కడప నగరం సాయిపేటకు చెందిన సయ్యద్ యాకూబ్ (21) ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు వివరాల మేరకు... యాకూబ్ చదువుకుంటూ లేత్ మిషన్‌లోకి పనికి వెళ్లే వాడు. ఈనెల 11న తల్లిదండ్రులు, చెల్లెలు నంద్యాలకు వెళ్లారు. ఇంట్లో యాకూబ్ అతని సోదరుడు ఉన్నారు. ఆయన సోదరుడు మధ్యాహ్నం బయటికి వెళ్లాడు. ఈ సమ యంలో యాకూబ్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తి ఆత్మహత్య

పులివెందుల టౌన్, జనవరి 12: పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న రాణితోపు వద్ద గజ్జల వెంకటరమణారెడ్డి (69) శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. వేముల మండలం పెండ్లూరు గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డికి ఇద్దరు సంతానం.

పెద్దకొడుకు వివాహం అనంతరం పులివెందులలో నివాసం ఉంటున్నారు. కొన్ని సంవత్సరాల కిందట అతను చనిపోవడంతో వెంకటరమణారెడ్డి తన భార్యతో కలిసి పెద్దకొడుకు ఇంట్లోనే ఉండేవారని, కుటుంబానికి సంబంధించిన కొన్ని కరాణాలతోనే ఉరివేసుకొని చనిపోయి ఉండవచ్చు అని అనుమానం వ్యక్తం చేశారు. వెంకటరమణారెడ్డి భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నష్టపరిహారం

● ఆర్డీవో శ్రీనివాసులు వెల్లడి

● తీవ్ర అన్యాయం జరుగుతోందని రైతుల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

ఎర్రగుంట్ల, జనవరి 12: జాతీయ రహదారి విస్తరణకు భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నష్టపరిహారం చెల్లిస్తామని జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. జాతీయ రహదారి (440)లో చాగలమర్రి నుంచి వేంపల్లె వరకు రోడ్డు విస్తరణకు రైతుల నుంచి భూసేకరణ చేసే నిమిత్తం శుక్రవారం ఎర్రగుంట్ల ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎన్‌హె చ్ ఏఈ సురేంద్ర తో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హనుమనగుత్తి, పోట్లదుర్తి, ఎర్రగుంట్ల, వై.కోడూరు, పెద్దనపాడు గ్రామాలకు చెందిన రైతులు భూములు కోల్పోతున్నారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జాతీయ రహదారి నియమ నిబంధనలు అనుసరించి ఈ భూసేకరణ చేస్తున్నట్లు తెలిపారు. ఏప గ్రామాల్లో ఎకరాకు ఎంత రేటు ఇచ్చేది రైతులకు వివరించారు. 2013 కేంద్ర ప్రభుత్వ నూతన భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తున్నట్లు తెలిపారు. హనుమనగుత్తి గ్రామంలోని భూములకు రూ.17,44,548, పోట్లదుర్తికి సంబంధించి రూ.23,11,879, ఎర్రగుంట్లలోని భూములకు రూ.31,67,970, కోడూరు గ్రామ భూములకు రూ.22,57,000, పెద్దనపాడు భూములకు 10,61,303 చెల్లిస్తారన్నారు. అయితే రైతులకు డబ్బు చెల్లించే సమయంలో ఈ మొత్తాలకు 12శాతం కలిపి చెల్లిస్తారన్నారు. అయితే పెద్దనపాడు గ్రామానికి గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవేరోడ్డుకు సుమారు రూ.14లక్షలు చెల్లించారని.. ఆ ప్రకారం చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలుంటే చెప్పాలని రైతులను కోరారు.

చాలా తక్కువ పరిహారం... రైతుల ఆవేదన

ప్రభుత్వం తమకు చెల్లిస్తున్న నష్టపరిహారంపై రైతులు అభ్యంతరాలు తెలిపారు. మార్కెట్‌రేట్‌తో పోలిస్తే ప్రభుత్వం చాలా తక్కువ ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కమర్షియల్ భూములకు, ఇళ్ల స్థలాలు ఉన్న, జాతీయరహదారి పక్కన ఉన్న భూములకు ఏధర చెల్లిస్తారని అడిగారు. కోర్టు కేసులున్న భూములు, ఇతర తగాదాల్లో ఉన్న భూముల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అలాగే తమ భూములు తీసుకున్న తర్వాత మిగతా పొలాలకు వెళ్లేందుకు దారి సమస్య లేకుండా చూడా లన్నారు. తీసుకున్న భూమికి హద్దును ఏర్పాటు చేస్తూ రాళ్లను పాతాలన్నారు. భూములు తీసుకున్న తర్వాత పక్కపక్కనే ఉన్న రైతులకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తాము అడిగిన చోట రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాలకు వెళ్లేందుకు బ్రిడ్జిలు నిర్మించి రస్తా ఏర్పాటు చేయాలన్నారు. కాగా, సమావేశానికి ఆర్డీవో గంటకు పైగా ఆలస్యంగా వచ్చి.. త్వరగా ముగించారని, తమ సందేహాలకు సరైన సమాధానం చెప్పలేదని కొందరు రైతులు పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారం చెల్లిస్తాం... ఆర్డీవో

హైవేకి అనుకుని ఉన్న భూములకు, స్థలాలకు, ఇళ్లకు తీసుకున్న స్థలాలకు నిబంధనల ప్రకారం వేరే ధర చెల్లిస్తారన్నారు. అలాగే మొదటి నోటిఫికేషన్‌కు ముందుగా కమిర్షియల్ చేసుకుని, ఒకటి రెండు లావాదేవీలు జరిపిన వాటికి కమిర్షియల్ ధర చెల్లిస్తారన్నారు. అలాగే స్థలాల్లో, భూముల్లో ఏవైనా కట్టడాలు, బోర్లు వుంటే వాటికి విడిగా విలువ కట్టి చెల్లిస్తారన్నారు. కోర్టులో కేసులున్న, ఇతర తగాదాల్లో ఉన్న భూములను పెండింగ్‌లో పెడతామన్నారు. రోడ్డుకు ఇరువైపులా అవసరమైనచోట రస్తా ఏర్పాటు చేస్తామని ఎన్‌హెచ్ ఏఈ సురేంద్ర తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ఏదైనా సమస్య వుంటే తనకు చెప్పవచ్చునని తహసీల్దార్ ఏ.నాగేశ్వరనావు తెలిపారు.

రైతుల సమస్యలను ఫ్రెండ్లీగా పరిష్కరించాలి : ఎస్ఈ



మాట్లాడుతున్న జిల్లా విద్యుత్తుశాఖ అధికారి రమణ

చాపాడు/మైదుకూరు, జనవరి 12: మండలంలోని రైతులు, ప్రజల సమస్యలను విద్యుత్తు సిబ్బంది ఫ్రెండ్లీగా పరిష్కరించాలని విద్యుత్తుశాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ పేర్కొన్నారు. మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో ఉన్న 33/11 విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను, చాపాడు గ్రామంలో దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్తు లైన్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్తు సిబ్బంది పనితీరు ఇంకా బాగా మెరుగుపరచుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యుత్తు వినియోగదారులు ఇబ్బందులకు గురవుతారన్నారు. లైన్‌మెన్లు గ్రామాలకు వెళ్లి దెబ్బతిన్న కరెంటు లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును నిరంతరంగా సరఫరా చేయాలని సూచనలు ఇచ్చారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తానని సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట మైదుకూరు డీఈఈ శ్రీనివాసులరెడ్డి, మండల ఏఈ సాయి ఉన్నారు.

వేసవిలో విద్యుత్ కోతలు లేకుండాచూడాలి

వేసవి కాలన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే వినియోగదారులకు విద్యుత్ కోతలు లేకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖాధికారి యస్.రమణ పేర్కొన్నారు. మైదుకూరు విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం సిబ్బంది, కొందరు వినియోగదారులతో ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా చూసుకోవాలని, అందుకు సంబంధించిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలని, రైతులకు అవసరమైన విద్యుత్ ఇవ్వాలని కోరారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్





సమావేశంలో ప్రసంగిస్తున్న పసుపులేటి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ పవన్‌కుమార్, హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులతో పవన్‌కుమార్

● రాజంపేట నియోజకవర్గ టీడీపీ నేత, పసుపులేటి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ పవన్‌కుమార్

రాజంపేట టౌన్, జనవరి 12: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని టీడీపీ నియోజకవర్గ నేత, పసుపు లేటి ఫౌండేషన్‌ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో తమ తండ్రి మాజీ మంత్రి స్వర్గీయ పసుపులేటి బ్రహ్మయ్య స్మారకార్థం నిర్వహించిన 45వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 12 జిల్లాలకు చెందిన 19 జట్ల క్రీడాకారిణులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలు పోటములు సమానమని, ఓటమిని ఒక అనుభవంగా తీసుకొని ముందు కు సాగితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పసుపులేటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన క్రీడా కారిణులకు ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు బీహార్ జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం క్రీడాకారులందరికీ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాన్వి ఇంటర్నేషనల్ డైరెక్టర్ భరత్‌కుమార్‌రాజు, ఏపీ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజనేయులు, కార్యదర్శి రవి, చంద్రశేఖర్‌రావు, సత్యప్రసాద్, సురేష్‌కుమార్, నిర్మల, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

● కళాశాల చైర్మన్ బి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 12: కడప నగరం ఉక్కాయపల్లె గ్రామ పంచాయతీలో గల శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల (ఎస్ఐటీఎస్)కు నాక్ ఉత్తమ ఏ గ్రేడ్ (3.14 జీపీఏ) లభించినందుకు కళాశాల చైర్మన్ బి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డాక్టర్ వై.నాగరాజు సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 4, 5 తేదీల్లో జరిగిన నాక్ ఇన్‌స్పెక్షన్‌లో కళాశాలలో గల విద్య, వసతులు మంచి అధ్యాపకులు, వివిధ విభాగాల్లో చేసిన అభివృద్ధిని గుర్తించడంతో తమ కళాశాలకు ఏ గ్రేడ్ లభించిందని తెలిపారు. ప్రిన్సిపల్ నాగరాజు ఆధ్వర్యంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం చక్కటి సమన్వయంతో కృషి చేసినందుకు ప్రతి ఫలంగా కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ లభించిందని చైర్మన్ శ్రీనివాసులు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో ఈ సంక్రాంతి వ్యక్తిగతంగా తనకు, కళాశాలకు రెట్టింపు ఆనందం ఇచ్చిందని తెలిపారు. కాగా, కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు చైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా బహుమతులను అందించారు.

ఫ్లాష్... ఫ్లాష్

లారీ ఢీకొని అన్నదమ్ములు మృతి

మైదుకూరు, జనవరి 12: హోటల్లో భోజనం చేసి వస్తున్న అన్నదమ్ములను లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మైదుకూరు నుంచి కర్నూలు బైపాసు రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా... పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఇమామ్ (25), షరీఫ్ (24) ఇరువురూ కలిసి డాబా వద్ద భోజనం చేసి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. ఇంతలోనే కర్నూలు వైపు నుంచి కడప వైపు వస్తున్న లారీ ఢీకొన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇమామ్, షరీఫ్‌లు ఇరువురూ అక్కడికక్కడే మృతిచెందారు. కాగా ఇమామ్‌కు భార్య, పిల్లలు ఉన్నారని స్థానికుల సమాచారం. సంఘటనా స్థలానికి మైదుకూరు పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దు టూరు ఆసుపత్రికి తరలించారు.





మృతిచెందిన ఇమామ్, షరీఫ్‌లు

ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయిమెంట్ నమోదు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 12: జిల్లాలోని నిరుద్యోగ యువత ఎక్కడినుంచైనా ఆన్‌లైన్ ద్వారా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలో నమోదు చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ పీఎస్ గిరీషా తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లు/ మోడల్ కెరీర్ సెంటర్ల ద్వారా అందించే సేవలను భారత ప్రభుత్వ నేషనల్ కెరీర్ సర్వీసు (ఎన్‌సీఎస్) పోర్టల్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానించిందన్నారు. ఈఆన్‌లైన్ సేవలు (ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యూవల్, అదనపు అర్హతల నమోదు) సులభతీరిన ఎంప్లాయిమెంట్.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ సేవలు, అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్‌లు/ మోడల్ కెరీర్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, మొబైల్స్ ద్వారా కూడా పొందవచ్చునన్నారు. సంబంధిత జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం అధికారి అభ్యర్థులను ఆమోదించిన పిదప ఎస్ఎంఎస్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు తెలియజేస్తారన్నారు.

ఏపీ ఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

ఏపీ ఎన్జీవో రాయచోటి యూనిట్ టేబుల్ క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ పీఎస్ గిరీషా ఆవిష్కరించారు. ఏపీ ఎన్జీవో అసోషియేషన్ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్, రాయచోటి అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కలెక్టర్ ఆవిష్కరించారు. అదే విధంగా జిల్లా సచివాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను కూడా ఆవిష్కరణ చేశారు. సచివాలయ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌అలీ, తాలూకా నాయకులు మహమ్మద్‌బాషా, మహదేవ, శ్రీనివాసులు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ విషయంలో దళారులను నమ్మవద్దు

● డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్), జనవరి 12: జిల్లాలో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ పారదర్శకంగా జరగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో వివిధ కేటగిరీలకు సంబంధించి టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్ (మేల్ అండ్ ఫీమేల్) కాంట్రాక్టు పద్ధతిలో 2014కు ముందు నుంచి పని చేస్తున్నారని.. వారిని శాశ్వత ప్రాతిపదికన క్రమబద్ధీకరించే ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని డీఎంఅండ్ హెచ్ఓ ఆప్రకటనలో తెలిపారు.

బకాయిలు చెల్లించే వరకు పోరాటం ఆగదు

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 12: ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన అన్నిరకాల బకాయిలను చెల్లించే వరకు తమ పోరాటం ఆగదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ఆఫీస్ బేరర్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న సొమ్మును సైతం రాష్ట్ర ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించి వారికి చెల్లించకపోవడం తగదన్నారు. ఉద్యోగులు కూడబెట్టుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్మును ఉద్యోగులకు తెలియకుండానే వాడుకున్న చరిత్ర ఈ ప్రభుత్వానికి దక్కిందన్నారు. తక్షణం తమకు రావాలసిన ఆర్థిక బకాయిలన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగానే జనవరి 14న భోగిమంటల్లో ప్రభుత్వ విధానాలు, నిర్లక్ష్యాన్ని దహించే విధంగా వినూత్న కార్యక్రమాలను చేపడతామన్నారు. జనవరి 19న నగర, తాలుకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, 24న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శన, 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జిల్లా కేంద్రాల్లో రిలేనిరాహారదీక్షలు నిర్వహిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ తీర్మానించిందన్నారు. వీటిని జయప్రదం చేసేందుకు అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వై.రవికుమార్, నరసింహారావు, చెన్నయ్య, శ్రీనివాసరావు, రమణ, పర్వీన్, ఎ.శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ కన్వీనరు ప్రభాకర్ పాల్గొన్నారు.

హక్కులకు రక్షణ కవచంలా రాజ్యాంగం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి



భారత న్యాయవాదుల సంఘం డైరీ, క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రధాన జడ్జి

కడప(రూరల్) జనవరి 12 : దేశంలోని సర్వజనుల హక్కులకు భారత రాజ్యాంగం రక్షణ కవచంలా ఉందని... దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత న్యాయవాదులందరిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి పేర్కొన్నారు. భారత న్యాయవాదుల సంఘం 2024 డైరీ, క్యాలండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ భారత రాజ్యాంగం పవిత్ర గ్రంధంలాంటిదన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల హక్కులను కాపాడుతోందన్నారు. కార్యక్రమంలో భారత న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు సి.సుబ్రమణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా, ఐఏఎల్ న్యాయవాదులు టీవీ రమణ, అమీన్‌పీరా, అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు



అవార్డు అందుకున్న వారితో ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప (క్రైం), జనవరి 12 : పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి వీక్లీ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నలుగురు సిబ్బందిని ఎంపిక చేసి నగదు రివార్డు, ప్రశంసాపత్రం అందించి అభినందించారు. కడప టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచడంతో పాటు క్రికెట్ బెట్టింగ్ కేసులో రూ.10,15,000ల నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర వహించిన ఏఎస్ఐ పి.భాస్కర్‌ను ఎస్పీ అభినందించారు. అలాగే బద్వేలు పోలీసుస్టేషన్ పరిధిలో ఓ కేసులో ఐదేళ్లుగా పరారీలో ఉన్న వ్యక్తిని లుక్ అవుట్ సర్క్యులర్ ద్వారా హైదరాబాదు ఎయిర్‌పోర్టుకు వెళ్లి అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. ఆ బృందంలో బద్వేలు పీఎస్ కానిస్టేబుళ్లు బి.రాజమోహన్ (పీసీ 2546), ఎన్.రమేష్ (పీసీ 2730)లు ఉండగా.. వీరిని ఎస్పీ అభినందించారు. ఇక స్పందన విభాగం కానిస్టేబుల్ షేక్ మున్నాఖాదర్‌వల్లి (పీసీ 1537) జిల్లాకు చెందిన జేకేసీ ఫిర్యాదులు, స్పందన ఫిర్యాదులను సకాలంలో ఆయా పోలీసు అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించడంలో కీలక పాత్ర వహించడంతో అభినందించారు.

సంక్రాంతి వేళ సంతోషం లేకుండా చేశారు

● ఉరి తాళ్లతో అంగన్వాడీల నిరసన

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 12: సంక్రాంతి పండుగ పూట మా కుటుంబాల్లో సంతోషం లేకుండా చేశావని అంగన్వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ కార్యాలయం 32వ రోజు నిరసన వ్యక్తం చేశారు. జగన్ చెప్పాడంటే చేస్తాడంతే అంటే ఇదేనా.. పాదయాత్ర సందర్భంగా మాట చెప్పావు.. అధికారంలోకి వచ్చాక మడమ తిప్పావు అని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరిచి పాదయాత్ర సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుక్కే విశ్వనాథనాయక్, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా కన్వీనర్ నాగేశ్వరి డిమాండ్ చేశారు. పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు మెడకు ఉరితాడు బిగించుకొని.. తాము పోయాక తమ శవాలపైన పరిపాలన చేసుకోండి అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ లీడర్లు సుజాత, అనురాధ, శోభ తదితర అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: అంగన్వాడీల ఉద్యమాన్ని వేగవంతం చేస్తామని రైల్వేకోడూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు రమాదేవి, నాయకురాలు పద్మ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరులో అంగన్వాడీలు, ఆయాలు భోగి మంటలు వేసి నిరసన వ్యక్తం చేశారు.

లక్కిరెడ్డిపల్లె: నెల రోజులుగా నిరసనలు, ధర్నాలు, చేస్తున్న అంగన్‌వాడీల గోడు ప్రభుత్వానికి పట్టదా అని మండల లీగల్ అథారిటీ ఛైర్మన్ న్యాయవాది చెన్నకృష్ణయ్య ప్రశ్నించారు. శుక్రవారం ఆయన అంగన్‌వాడీల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ చేశారు



రాయచోటి: పైట కొంగుతో ఉరి వేసుకొని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు



రైల్వేకోడూరు: భోగి మంటలు వేసి నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, ప్రధాన కార్యదర్శి ప్రభావతి, సెక్టారు లీడర్లు లక్ష్మీదేవి, నాగమణి, నాగవేణి, ఇరగమ్మ, శిరీష, శ్రీవాణి, మూడు మండలాల అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు

రాజంపేట: రాజంపేటలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె 32 రోజులకు చేరుకున్న సందర్భంగా అంగన్‌వాడీ నాయకులు ఈశ్వరమ్మ, అమరావతి, శివరంజిని, జ్యోత్స్న గౌసియా తదితరులు కార్యాలయ ప్రాంగణంలో 32 ఆకారంలో కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను ఇంత వరకు పరిష్కరించకపోవడం దుర్మార్గమన్నారు. వెను వెంటనే ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

'టికెట్ ఎవరికి ఇచ్చినా కలిసి పనిచేస్తాం'

రామాపురం, జనవరి12: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ ఎవరికి ఇచ్చినా కలిసికట్టుగా టీడీపీ విజయానికి కృషి చేస్తామని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తన ఇంట్లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం అవినీతిమయమైందన్నారు. ఇసుక, మద్యం, మైన్స్ ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం ముఖ్యమంత్రికి చేరుతుందని, మిగిలిన 50 శాతమే ప్రభుత్వానికి చేరుతోందన్నారు. ధరల పెరుగుదలపై ప్రజలు విసిగిపోతున్నారన్నారు. .



టీడీపీని గెలిపిస్తే ఝురికోన ప్రాజెక్టు నీరు అందిస్తాం

సంబేపల్లె, జనవరి 12: టీడీపీ అధికారంలోకి రాగానే సంబేపల్లె మండల రైతులకు ఝురికోన ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీరు అందిస్తామని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం శెట్టిపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రెడ్డిమల్లువారిపల్లె, ఎర్రమొరంపల్లె, నదిపిరివాండ్లపల్లె, చెరుకువాండ్లపల్లె, వల్లబండపల్లె, నాయునివారిపల్లె, మర్రి మాకులపల్లె, దొడ్డి సిద్దయ్యగారిపల్లెల్లో గడప గడపకు తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా పేరుతో వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పి టీడీపీకి పట్టం కట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు కాలాడి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చిన్న రెడ్డెయ్య యాదవ్, తెలుగు యువత కూనాసి హరిరాహుల్, కల్యాణ మండపం రమణ, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో కలిసి వెళుతున్న మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి

రాజంపేట: రాజంపేట మండలం ఆర్.బుడుగుంటపల్లెలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి సంగమేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: మండలంలోని ఓదివీడు గ్రామ పంచాయతీ బెస్తపల్లె, రామాపురంలలో మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు మాట్లాడుతూ తెలుగుదేశం చంద్రబాబుతోనే ఈ రాష్ట్రానికి భవిష్యత్తు ఉందన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు జగిలి రామచంద్ర, బూత్ ఇన్‌చార్జిలు సిద్దిరాజు, సుధాకర్, సీనియర్ నాయకులు రెడ్డిశేఖర్‌రాజు, మండల ఉపాధ్యక్షుడు దుర్గం ఆంజనేయులు, తెలుగు యువత నాయకుడు పోరుమామిళ్ల చలపతి, ఐటీడీపీ పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు గుర్తింపు

రైల్వేకోడూరు, జనవరి 12: టీడీపీ హయాంలోనే బీసీలను గుర్తించారని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 56 కార్పొరేషన్లకు ఒక్కదానికీ విధులు, నిధులు లేవని ఆరోపించారు. ఓట్ల కోసమే వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందన్నారు. బీసీలను నిజంగా గుర్తించింది టీడీపీయే అని తెలిపారు. బీసీల్లో అవగాహన, చైతన్యం తెచ్చేందుకు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలు టీడీపీకి మద్దతు పలకాలని కోరారు. రాష్ట్ర బీసీ నాయకులు కమతం నాగరాజుయాదవ్, నాయుడోరి రమణ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాజంపేట పార్లమెంట్ బీసీ సంఘం అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, మాజీ సర్పంచ్ మలిశెట్టి మురళీధర్ గౌడ్, గుత్తికొండ త్యాగరాజు, బరతాల శ్రీధర్, కన్వీనర్ వలసాని గుండాలయ్య, బాలక్రిష్ణయాదవ్, దొమ్మలపాటి గోపాల్, చంద్రశేఖర్, సిద్ధేశ్వర, శివ పాల్గొన్నారు.



రైల్వేకోడూరు: మాట్లాడుతున్న కస్తూరి, పక్కనే చమర్తి జగన్‌మోహన్‌రాజు

అనంతరం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీగా వెళ్లి జగన్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రతి ఏటా జనవరి 1న నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ను విడుదల చేస్తామని చెప్పిన సీఎం ఇంతవరకు దాని ఊసే ఎత్తలేదన్నారు.

సైకో పాలన అంతమొందించేందుకు ప్రజలందరూ ఐక్యం కావాలి

సిద్దవటం, జనవరి12 : సైకో పాలన అంతమొందించేందుకు ప్రజలందరూ ఐక్యం కావాలని జనసేన రాజంపేట నియోజకవర్గ నాయకులు అతికారి దినేష్, కృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్కూల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను శుక్రవారం వారు ప్రారంభించారు. మొదటి బహుమతి విజయలక్ష్మికి 30వేలు, రెండవ బహుమతి విజయశాంతికి 20వేలు, మూడవ బహుమతి సువర్ణలక్ష్మికి రూ. 10వేలు అందజేశారు. కడప జనసేన పార్టీ అధ్యక్షుడు సుంకర శ్రీనివాసులు, తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు కుప్పాల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



బహుమతి ప్రదానం చేస్తున్న అతికారి దినేష్, కృష్ణ

సుండుపల్లె: జనసేన పార్టీ ఆధ్వర్యంలో అతికారి రోషమ్మ, వెంకటసుబ్బయ్య జ్ఞాపకార్థం అతికారి వారి ఆర్థిక సాయంతో మండల కేంద్రంలోని ఎంకేఆర్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి ముగ్గురు మహిళలకు రూ.30 వేలు, ద్వితీయ బహుమతి నలుగురు మహిళలకు రూ.20 వేలు, తృతీయ బహుమతి 5 మందికి రూ.10 వేలు అందజేశారు. నియోజకవర్గ జనసేన సమన్వయకర్త అతికారి దినేశ్, జనసేన మండల మహిళా అధ్యక్షురాలు రెడ్డిరాణి, టీడీపీ జిల్లా నాయకులు కుప్పల వెంకటసుబ్బయ్య, ఉపసర్పంచ్ హిదాయతుల్లా, ఓబులయ్య, మైనార్టీ యూత్ అధ్యక్షుడు గౌస్‌బాషా, టీడీపీ నాయకులు రామాంజులు, మస్తాన్‌బాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు : నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ, ఆర్ఎస్ రోడ్డులో జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గ నాయకులు ఎల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ముగ్గుల పోటీల్లోఎంబలూరు కళ్యాణి ప్రథమ బహుమతి 15వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులను ఝాన్సీ లక్ష్మీ 10వేల రూపాయలు, వెంకటసుబ్బమ్మ 5వేల రూపాయలను గెలుచుకున్నారు. అనంతరం నిర్వహించిన మ్యూజికల్స్ ఛైర్స్ పోటీలలో సి.మాధవి, ఎస్.లలిత సంయుక్త విజేతలుగా నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ శ్రీవాణి, ఎల్లటూరు మంజుల వ్యవహరించారు. పోటీకి పాల్గొన్న ప్రతిమహిళకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్లటూరు శివరామరాజు, జనసేన పార్టీ రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్ జ్యోతి, సమ్మెట శివ ప్రసాద్, ఆకుల చలపతి, గురివిగారి వాసు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు దేశభక్తి, జాతీయ భావాలు అవసరం

రాయచోటిటౌన్, జనవరి 12: ఉపాధ్యాయులు దేశభక్తితో పాటు జాతీయ భావాలు కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నరసింహులు పిలుపునిచ్చారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో స్వామి వివేకానందుడి 161వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి,గౌరవాధ్యక్షుడు పరశురాం, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడారు. అపస్ నాయకులు రామేశ్వర్, బాలాజీ, వెంకటేశ్వర్లు, మల్లయ్య, సుశీల, కృష్ణవేణి, మధు, శైలజ, జిల్లా నాయకులు, మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోస్వామి వివేకానంద చిత్రపటానికి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.సాయిగ్రేస్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, ఎస్.ఎస్ఎస్ అధికారులు పి.నీలవేణి,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్వేలి : చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ ట్రూప్ అధికారి పసుపుల రాజశేఖర్, ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ప్రసాద్, దుర్గరాజు, శ్రీనివాస్, ప్రమీల, వెంకటసుహాసిని కిరణ్ కుమార్‌రాజు, ఎన్‌సీసీ సార్జెంట్ శరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర పథకాలు అందించడమే ధ్యేయం

చిన్నమండెం, జనవరి12: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అందరికీ అవగాహన పెంపొందించడంతో పాటు అర్హులందరికీ కేంద్ర పథకాలు అందేలా చేయడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్యమని బీజేపీ మోర్చా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. మండలంలోని టీ. చాకిబండ, దిగువగొట్టివీడు గ్రామ పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీడీవో దివ్య, సర్పంచులు, ఏపీ యం రెడ్డెమ్మ, పంచాయతీ సెక్రటరీలు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తైక్వాండో పోటీల్లో 9 మందికి బంగారు పతకాలు

రైల్వేకోడూరు, జనవరి 12: సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో తమ విద్యార్థులు 9 బంగారు పతకాలు సాధించారని ఎస్వీకే స్పోర్ట్స్ కోచ్ శివాజీ తెలిపారు. . శుక్రవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ తమ విద్యార్థులు భవ్యశ్రీ, హేమవర్షిని, హిమబిందు, మనీషా, నాగచైతన్య, జగదీశ్వర్, హర్షవర్ధన్, కమల్‌శివాజీ, థామస్‌సాయి ఈ నెల 10న ప్రొద్దుటూరులో నిర్వహించిన 37వ సబ్ జూనియర్ జిల్లా పోటీల్లో బంగారు పతకాలను సాధించగా 8 మంది రజత, నలుగురు కాంస్య పతకాలు సాధించారన్నారు. వారు ఈ నెల 20, 21 తేదీల్లో నంద్యాల లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

భూ సేకరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి

రైల్వేకోడూరు, జనవరి 12: భూ సేకరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయంలో ఓబులవారి పల్లె మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ అధ్యక్షతన కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసేకరణ చట్టంతో ముఖ్యమంత్రి జగన్ రాజకీయ నాయకులకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. నిరుపేదలైన వారికి ఎవరికి న్యాయం జరగదని తెలిపారు. డీకేటీ భూములన్నింటినీ భూసేకరణ చట్టాన్ని అడ్డుపెట్టుకుని దోచుకుంటున్నారని ఆరోపించారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, జనవరి12: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళీ అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున వీరభద్రాలయానికి చేరుకొని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రాహుకాల పూజల విశిష్టతను వివరించారు.

వైసీపీ పాలనలో తిరోగమనంలో రాష్ట్రం

పుల్లంపేట, జనవరి12 : రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ విమర్శించారు. శుక్రవారం పుల్లంపేటలో కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు కంభాల శ్రీనివాసులు అధ్యక్షతన ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. జగన్ పాలనలో ఏ ఒక్క వర్గానికి మేలు జరగలేదని రాష్ట్రం అన్ని రంగాల్లో విఫలమై తిరోగమనంలో ఉందన్నారు. రాష్ట్రంలో వైసీపీ నాయకులు భూకబ్జాలు చేసి పేదలకు భూములు అందకుండా చేశారన్నారు. ఇసుక మాఫియా చెలరేగి పోయిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంద్యాల సురేష్, జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు, అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చెంగల్‌రాజు, అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : పుల్లంపేటలో కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు కంభాల శ్రీనివాసులు అధ్యక్షతన ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఓబులవారిపల్లె: ప్రపంచ దేశాల్లో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది బీజేపీ అని ఆ పార్టీ నేతలు అన్నారు. శుక్రవారం మండలంలోని తల్లెంవారిపల్లెలో నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త చిన్నరెడ్డి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ నాయకుడు సత్యకుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్, అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చంగల్‌రాజు ఆధ్వర్యంలో బీజేపీ జెండా ఆవిష్కరించారు.

రైతు ప్రభుత్వాలు కాదు.. రాబందు ప్రభుత్వాలు

రామాపురం, జనవరి 12: వైసీపీ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం కాదని రాబందు ప్రభుత్వమని అన్నమయ్య జిల్లా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి అన్నారు. రామాపురంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటరు బిగించే విధానం ఇప్పటికైనా మానుకోవాలన్నారు. పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మండల కార్యదర్శి జాను, రామాంజుల్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రాజా, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు ప్రాధాన్యం

రాజంపేట, జనవరి12 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతనే రాష్ట్రంలోని బీసీలకు అన్ని రంగాలలో ప్రాధాన్యం లభించిందని.. అదే వైసీపీ పాలనలో బీసీలను అన్ని రంగాల్లో అణగదొక్కి.. కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బీసీ నాయకుడు డాక్టర్ చెన్నూరు సుధాకర్ తెలిపారు. శుక్రవారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో బీసీ సాధికార సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ సాధికారత పేరిట సమావేశాలు పెట్టిందే తప్ప చేసిందేమీ లేదన్నారు. బీసీలందరూ వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. శివప్రసాద్‌నాయుడు, రేవూరి నరసింహ, డీఆర్ఎల్ మణి, మాజీ కౌన్సిలర్లు మనుబోలు వెంకటేశ్వర్లు, ముమ్మడి చిన్నయ్య, రాష్ట్ర బీసీ నాయకులు ఇడిమడకల కుమార్, రామ్ నగర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ సుధాకర్

జూదరుల అరెస్టు


చిట్వేలి, జనవరి12 : చిట్వేలిలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం దాడులు నిర్వహించి వారి నుంచి రూ. 2580 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

14 నుంచి క్రికెట్ పోటీలు

రాయచోటిటౌన్, జనవరి12:మండల పరిధిలోని చెన్నముక్కపల్లె లో సంక్రాంతి పండుగ సందర్భంగా 14వ తేదీ నుంచి ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలునిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్స్ ఉదయ్ కిరణ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సురేశ్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. వంద రూపాయలు ఎంట్రీ ఫీజు ఉంటుందని, విజేతలకు ప్రథమ బహుమతి రూ.30,016లు, రెండవ బహుమతి కింద రూ.20, 016లు నగదు బహుమతితో పాటు మెమెంటోలు అందజేస్తామన్నారు. ఔత్సాహిక జట్ల సభ్యులు చెన్నముక్క పల్లె రింగు రోడ్డు జంక్షన్ వద్ద గల సచివాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని వారు సూచించారు.


లావాదేవీలు పారదర్శకంగా ఉండాలి

వీరబల్లి, జనవరి 12: లావాదేవీలు పారదర్శకంగా ఉండాలని వైఎస్ఆర్ క్రాంతి పథం సహాయ ప్రాజెక్టు మేనేజర్ ఖాదర్‌వలి అన్నారు. శుక్రవారం సోమవరం వడ్డెపల్లె ప్రాథమిక పాఠశాలలో జరిగిన గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రుణాలను సక్రమంగా చెల్లించాలని, సంఘాల్లో పొదుపు పెంచుకోవడం వల్ల సంఘనిధి పెరగడంతో పాటు అంతర్గత రుణాలు ఇచ్చుకునే అవకాశం ఉంటుందన్నారు.





నా ఎస్టీలు, నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు.. అంటూ జగన్‌రెడ్డి పదేపదే పాడే పాట వెనుక నిజం ఏమిటో ఎన్నికల వేళ వెల్లడవుతోంది. ఉమ్మడి జిల్లా సిటింగ్‌ల్లో తన సొంత సామాజికవర్గానికి తప్ప ఇంకెవరికీ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు ఆయన. రాబోయే ఎన్నికల్లో సీట్లు లేవంటూ కొందరిని , అటునిటు మార్చి కొందరిని, ఏమీ తేల్చకుండా మరికొందరిని మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. జగన్‌రెడ్డి తీరుతో ఎస్సీ, ముస్లిం, బలిజ సామాజిక వర్గాలు భగ్గుమంటున్నాయి. సొంత పార్టీలోనూ ఈ వర్గాలతో ఆయన రాజకీయ ఆటలు ఆడుకుంటున్నారు. - తిరుపతి,ఆంధ్రజ్యోతి



ఆట గద జగనా!

వైసీపీలో ఎస్సీ, బలిజ, ముస్లిం సిటింగ్‌ల సీట్లు మాత్రమే గల్లంతు

భద్రంగా రెడ్డి సామాజిక వర్గం

గురువారం రాత్రి విడుదల చేసిన వైసీపీ మూడవ జాబితాలో ఉమ్మడి చిత్తూరు జిల్లా,తిరుపతి జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలున్నాయి. ఒక ఎంపీ, ఐదుగురు ఎమ్మెల్యేల రాజకీయ భవితవ్యాలు తల్లకిందులయ్యాయి. గూడూరు, పూతలపట్టు ఎస్సీ సిటింగ్ ఎమ్మెల్యేలు వరప్రసాదరావు, ఎంఎస్ బాబులకు టికెట్లు గల్లంతయ్యాయి. సత్యవేడు ఎస్సీ సిటింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం తిరుపతి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాల్సి వస్తోంది. అలాగే తిరుపతి ఎస్సీ సిటింగ్ ఎంపీ గురుమూర్తి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలవాల్సి వస్తోంది. మదనపల్లె ముసిం సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషా టికెట్ గల్లంతైంది. చిత్తూరులో బలిజ సిటింగ్ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు టికెట్ సైతం గల్లంతైంది.

తగ్గి ఒంగినా.. పాపం బాబు!




2019లో అనూహ్యంగా పూతలపట్టు ఎమ్మెల్యే టికెట్ దక్కించుకున్న ఎంఎస్ బాబు, ఆ ఎన్నికల్లో ఒక పోలింగ్ కేంద్రం బ్యాలెట్ బాక్సులో నీళ్ల పోసేసి గ్రామస్తుల దాడికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మెల్యేగా గెలిచినా ఆ అధికారాన్ని అనుభవించే అవకాశం వైసీపీలోని ఆధిపత్య కులానికి చెందిన మండల స్థాయి నాయకులు అయనకు దక్కకుండా ఇష్టానుసారం ఆడుకున్నారు. 2024లో తిరిగి టికెట్ దక్కించుకోవాలనే ఆశతోనే ఓపికగా అన్నీ భరించారు. ఇటీవల టికెట్ లేదనడంతో తీవ్ర మానసిక అశాంతితో కుంగిపోయారు. తన ఆవేదనను వెల్లడించారు. ఆ వెంటనే నాలుక కరచుకుని మాట మార్చారు. మంత్రి పెద్దిరెడ్డి పట్ల వినయాన్ని ప్రకటించారు. ఇదంతా టికెట్ మళ్లీ పొందాలనే తలొగ్గి చేశారు. అయినా చివరికి టికెట్ గల్లంతైంది. మాటా పోయి, మనసూ కలతచెంది మౌనంగా ఉన్నారు.

తలొగ్గక దెబ్బతిన్న నవాజ్‌బాషా



మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెత్తనం చెలాయిస్తున్న బడా నేతకు లొంగలేదు. ఆ నేత అడుగులకు మడుగులొత్తలేదు. మరో మహిళా నేతను ఆశ్రయించి ఆమె ద్వారా అధిష్ఠానానికి చేరువై నేరుగా పనులు చేసుకుంటూ వచ్చారు. ఆదే ఆయన పాలిట శాపమైంది. వైసీపీ అధికార సామాజిక వర్గం బడా నేత కన్నెర్రతో ఈ మైనారిటీ నాయకుడికి తేలిగ్గా బై చెప్పేశారు.

పెనం నుంచి పొయ్యిలోకి ఆదిమూలం



సత్యవేడు సిటింగ్ ఎమ్మెల్యే పరిస్థితి పెనంమీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యింది. ఆవిర్భావం నుంచీ కోనేటి ఆదిమూలం పార్టీలో వుంటూ 2014లో ఓడిపోయినా, 2019లో గెలిచారు. గెలుపు ఆనందం ఈ ఐదేళ్లలో ఆయనకు ఎన్నడూ దక్కలేదు.ముఖ్య నేతల వర్గాలు సొంత నియోజకవర్గంలో ఆయనకు స్వతంత్రత లేకుండా చేశాయి. ఆరోపణలు, నిందలతో ఆయన్ను ఉక్కిరిబిక్కిరి చేశారు. రెండు నెలలుగా టికెట్ దక్కదన్న ప్రచారం ఆయనకు, ఆయన కుటుంబానికి నరకం చూపింది. తీరా ఇప్పుడు సత్యవేడు లేదని, తిరుపతి ఎంపీ సీటిస్తామని తేల్చారు.

ఇది ప్రమోషనో, డిమోషనో అర్థంకాని అయోమయంలో ఆయన పడిపోయారు.

ఒక్క నియోజకవర్గంలోనే సతమతం అయిపోయిన ఆయనకు జిల్లా అంతా సమాళించుకోగల శక్తి సామర్థ్యాలు లేవు.

వరం దక్కని ప్రసాదు




గూడూరు సిటింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావు రిటైర్డు ఐఏఎస్ అధికారి. ఉద్యోగ విరమణ చేశాక వైసీపీలో చేరి 2014లో తిరుపతి నుంచీ ఎంపీగా పోటీ చేసి గెలిచారు. 2019లో గూడూరు ఎమ్మెల్యేగా పోటీ చేయమన్నారు. మూటాముల్లె సర్దుకుని అక్కడకు వెళ్లి పోటీ చేసి గెలిచారు. 2024లో ఈ స్థానభ్రంశమూ లేదు. మాజీ ఐఏఎస్‌ను రాజకీయంగా నడిరోడ్డుపై నిలబెట్టింది వైసీపీ అధిష్ఠానం.

ఇలా అయిందేమిటి గురుమూర్తికి?



తిరుపతి ఎంపీ గురుమూర్తిదీ ఇదే పరిస్థితి. ఉప ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెలిచారు. సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు. వివాదరహితుడు. బడా నేతలందరితోనూ వినయంగా మసలేవారు. ఢిల్లీకి అలవాటు పడుతుండగానే ఆయనను అసెంబ్లీకి పరిమితం చేశారు. సత్యవేడును కేటాయించారు. ఈ మూడు నెలల్లో అక్కడ అన్నీ వెతుక్కోవాలి. తనకంటూ వర్గాన్ని నిర్మించుకోవాలి. ఆఖరి నిమిషంలో ఇదేమిటిలా అయిపోయిందే అనే దిగులుతో ఆయన ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

రెపరెపలాడుతున్న ఆశలో ఆరణి



బడా నేతకు జీ హుజూర్ అన్నా చిత్తూరు టికెట్ రెండోసారి సిటింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు దక్కలేదు.సొంత ముద్రన్నదే లేకుండా అధికార సామాజికవర్గం బడా నేత చెప్పిందల్లా ఈయన చేశారు. అయితే బలిజ సామాజిక వర్గానికి చెందిన ఈయనకు చాపకింద నీరులా నియోజకవర్గంలో అగ్రవర్ణ నాయకుడిని సమాంతరంగా వెనుకనుంచి ఎగదోస్తూ వచ్చారు. చిత్తూరులో బలమైన సామాజికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా సరే, చివరికి ఆయనకు టికెట్ దక్కలేదు. ఆయన సామాజికవర్గాన్ని దువ్వడానికి రాజ్యసభ ఆశ చూపుతున్నా అదెంతవరకూ నెరవేరుతుందో తెలియని పరిస్థితి. రాజ్యసభ తాయిలంతో గట్టిగా తిరగబడనూ లేక, నోరు తెరిచి అన్యాయం జరిగిందని అడగనూ లేక మౌన రోదనలో ఉన్నారు ఆరణి శ్రీనివాసులు.

అభద్రతలో వీరు

నియోజకవర్గ ఇన్‌చార్జులను ప్రకటించిన చోటే కాదు, మిగిలిన నియోజకవర్గాల వైసీపీ నేతల్లోనూ టెన్షన్ కొనసాగుతోంది. జీడీ నెల్లూరులో డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, నగరిలో మంత్రి ఆర్‌కే రోజా, పలమనేరులో వెంకటేగౌడ, సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్యలను ఇప్పటికీ అభద్రతా భావం వెన్నాడుతోంది. అధిష్ఠానం నారాయణస్వామికి టికెట్ నిరాకరించిందని తొలుత పార్టీలో ప్రచారమైంది. తర్వాత ఆయన బతిమాలుకోగా సీటు ఖరారు చేసినట్టు ప్రచారం జరిగింది. తాజాగా స్వామికి కాకుండా ఆయన కుమార్తె కృపాలక్ష్మి పేరు పరిశీలిస్తున్నట్టుగా ప్రచారమవుతోంది. వారంవారం వేర్వేరు ప్రచారాలు జరుగుతుండడంతో నారాయణస్వామి మానసిక వేదనకు గురవుతున్నట్టు సమాచారం. చీమ చిటుక్కుమన్నా చంద్రబాబుపై విరుచుకుపడే స్వామి ఇటీవల జోరు తగ్గించడం గమనార్హం. నగరిలో మంత్రి రోజాదీ అదే పరిస్థితి. మొదట్లో ఆమెకు టికెట్ లేదన్న వదంతులు ప్రబలాయి. ఓ దశలో తనకు టికెట్ రాకున్నా పరవాలేదని, పార్టీ కోసం త్యాగానికి సిద్ధమని ఆమె ప్రకటించారు కూడా. తర్వాత అధిష్ఠానం మెత్తబడి మళ్ళీ అవకాశమిస్తోందనే మాటలు వినిపించాయి. తరచూ చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్‌లపై విరుచుకుపడే రోజా కొంతకాలంగా మౌనం పాటిస్తున్నారు.ఇక సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్యతో వైసీపీ అధిష్ఠానం పూటకో మాటతో ఆటాడుకుంటోంది. మూడో జాబితాలో సూళ్ళూరుపేటకు కొత్త వారిని ఇంచార్జిగా వేయకపోవడంతో హమ్మయ్య అంటూ తాత్కాలికంగా ఊపిరి తీసుకున్నారాయన. టికెట్ గురించి రెండు మూడు నెలలుగా సంజీవయ్య తీవ్ర మానసిక వ్యధ అనుభవిస్తున్నారు. పలమనేరులో వెంకటేగౌడ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. కాకపోతే ఆయనకు ప్రత్యామ్నాయం కోసం అధిష్ఠానం అన్వేషిస్తోంది. ఇటీవల వైసీపీలో చేరిన ఆర్వీ సుభాష్ చంద్రబోస్ పేరు టికెట్ రేసులో వినిపిస్తోంది. టికెట్ ఖరారయ్యే దాకా గౌడకు కూడా టెన్షన్ తప్పడం లేదు.

నిశ్చింతగా వారు

రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అత్యధిక ఎమ్మెల్యేలు మాత్రమే ఉమ్మడి జిల్లాలో నిశ్చింతగా ఉన్నారు. రాజంపేట ఎంపీ, వెంకటగిరి, తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, తంబళ్ళపల్లి, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెడ్డి సామాజికవర్గానికి చెందిన సిట్టింగు ఎమ్మెల్యేలు, ఇద్దరు వారసులకు టికెట్ భద్రత కల్పించింది అధిష్ఠానం. వెంకటగిరిలో ఆనం రామనారాయణ రెడ్డితో ఎప్పటికైనా సమస్య వస్తుందన్న భావనతో అధినేత ముందస్తుగానే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ప్రాధాన్యత ఇచ్చారు. ఆయనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఆనంతో వ్యవహారం చెడగానే గంటల వ్యవధిలో రామ్‌కుమార్‌ను వెంకటగిరి ఇంచార్జిగా నియమించేశారు. అప్పటి నుంచీ ఆయన నిశ్చింతగా ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు.శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్ళపల్లిలో మంత్రి సోదరుడు ద్వారకనాథరెడ్డి, పీలేరులో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వంటి పాతకాపులు టికెట్‌పై ధీమాగా వుండి ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. వీరికి భిన్నంగా ఎస్సీ, ముస్లిం, బలిజ సామాజికవర్గం సిటింగు ఎమ్మెల్యేలు టికెట్ పోగొట్టుకోవడమో లేక మరో స్థానానికి బదిలీ కావడమో జరుగుతోంది. దీంతో ఆయా వర్గాలకు చెందిన విద్యావంతులు, కాస్తోకూస్తో చైతన్యం కలిగిన వారు వైసీపీ అధిష్ఠానం తీరుతో రగిలిపోతున్నారు.

పలమనేరు వైసీపీ అభ్యర్థి ఎవరు?

- కొత్త జాబితాలోనూ దక్కని చోటు
- ప్రత్యామ్నాయం దొరకలేదా లేక సిటింగ్‌పై నమ్మకం లేకనా?

పలమనేరు, జనవరి 12: వైసీపీ విడుదల చేసిన మూడు జాబితాల్లోనూ పలమనేరుకు చోటు లేకపోవడం చర్చగా మారింది. సిటింగ్ ఎమ్మెల్యే వెంకటేగౌడకు మళ్లీ అవకాశం దక్కుతుందా, దక్కదా అనే మాటలు పెరిగాయి. వెంకటేగౌడకే మళ్లీ అవకాశం అని ఆయన వర్గం బలంగా చెబుతున్నప్పటికీ, వైసీపీ కార్యకర్తలే దీన్ని గట్టిగా నమ్మడం లేదు. ఇదే నిజమైతే ఆయన పేరు ఇప్పటికే ప్రకటించేసి ఉండేవారు కదా అంటున్నారు. టీడీపీ నుంచి మాజీ మంత్రి అమరనాథరెడ్డి బరిలో ఉంటారన్నది స్పష్టం. ఈయనను బలంగా ఎదుర్కొనే శక్తి వెంకటేగౌడకు లేదని వైసీపీ అధిష్ఠానం భావిస్తోందని ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల్లో గెలిచినా, అది వైసీపీ గాలి బలమేనంటున్నారు. పార్టీ పలుమార్లు నిర్వహించిన సర్వేల్లో కూడా ఇదే తేలినట్లు చెప్పుకుంటున్నారు.

ఆయనకైతే పనిచేయమంటున్న నేతలు

నియోజకవర్గంలో పార్టీ ఇన్‌ఛార్జీల నియామకంలో వెంకటేగౌడ వ్యవహరించిన తీరుపై ఇప్పటికే ద్వితీయ శ్రేణి నేతల్లో అసంతృప్తి ఉంది. ఆయన వ్యవహార శైలి వల్ల ఇప్పటికే పలువురు మండల నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. పలమనేరులో అభ్యర్థిని మారిస్తే తప్పితే వీరు వైసీపీ అభ్యర్థి గెలుపుకోసం పనిచేసే అవకాశాలే లేవని తెలుస్తోంది. వెంకటేగౌడనే కొనసాగిస్తే వీరంతా ఈ ఎన్నికల్లో అమరనాథరెడ్డి గెలుపునకు పనిచేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ అసందిగ్ధత వల్ల వైసీపీలో మందకొడితనం పెరగగా, టీడీపీ నేతలు జోరుగా పర్యటనలతో దూసుకుపోతున్నారు.

సందడిలేని బోస్ : ఇటీవల వైసీపీలో చేరిన బాలాజి కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షుడు ఆర్.వి.సుబాష్‌చంద్ర బోస్ పేరు కూడా తరచూ ప్రచారంలోకి వస్తోంది. పెద్దిరెడ్డి ఆశీస్సులు ఆయనకు మెండుగా ఉన్నాయని, ఆయనకే టికెట్టు ఇస్తారని తొలుత ప్రచారం బలంగా జరిగింది. అయితే ఎందుకో తెలియదు గానీ ఆ తర్వాత పార్టీలో బోస్ హడావుడి ఏమీ లేకుండా పోయింది. దీంతో ప్రత్యామ్నాయాల మీదా చర్చ జరుగుతోంది. పెద్దిరెడ్డి కుటుంబంనుంచే మరొకరు పలమనేరులో పోటీ చేస్తారని వినిపించినా, అందుకు జగన్ ఒప్పుకోలేదని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అమరనాథరెడ్డిని ఢీకొనగలిగిన బలమైన నాయకుడి కోసం పార్టీ వెతుకుతున్నట్టు కూడా చెప్పుకుంటున్నారు. అందుకు తగిన ఆర్థిక వనరులుంటేనే టికెట్ ఇస్తారనీ లేకపోతే తిరిగి వెంకటేగౌడకే ఛాన్స్ దక్కుతుందని కూడా ప్రచారం అవుతోంది.

డీసీసీబీ పాలకవర్గ గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 12: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నాన్‌అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీతో కూడిన పాలకవర్గ గడువును మరో ఆరునెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఏడుగురు సభ్యులతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్‌పర్సన్‌గా ఎం.రెడ్డెమ్మ ఉంటున్నారు. ప్రస్తుత పాలకవర్గ కమిటీ పదవీకాలం ఈనెల 17వ తేదీతో ముగియనుంది. ఈ పదవీకాలాన్ని 2024 జనవరి 18వ తేదీ నుంచి 2024 జూలై 17వ తేదీ వరకు ఆరునెలల పాటు లేదా ఎన్నికలు నిర్వహించేంతవరకు పొడిగిస్తున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొంది.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై నివేదికలివ్వండి



ఎన్నికల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 12: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు శనివారంలోగా నివేదికలు ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. శుక్రవారం జడ్పీ సమావేశ హాలులో ఆయన ఎన్నికల అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలను పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని చెప్పారు. అక్కడకు వచ్చే ఓటర్లకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత తహసీల్దార్లు, కమిషనర్లు, పంచాయతీరాజ్, ఎస్ఎస్ఏ అధికారులదేనని స్పష్టంచేశారు. మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు ఉండేలా చూడాలన్నారు. విభిన్న ప్రతిభావంతులైన ఓటర్ల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 22న ఓటరు తుదిజాబితా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్నికల నిర్వహణలో దోషరహిత ఓటరు జాబితా కీలకమని, అలాంటి జాబితా తయారీలో రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



ముగ్గు వేస్తున్న తెలుగుమహిళలు - సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణంపట్టేలా ముగ్గులు

తెలుగు మహిళల సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి కానుక పంపిణీ చేస్తున్న దొరబాబు, చెన్నకేశవులు నాయుడు

చిత్తూరు సిటీ, జనవరి 12: చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం తెలుగుమహిళల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. తెలుగు మహిళలు ముగ్గులు వేసి, పొంగళ్లు పెట్టి వేడుకలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న తెలుగుమహిళలు హాజరై ఆటల పోటీలు, ముగ్గులు వేశారు. వీరందరికీ జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు, టీడీపీ సీనియర్ నేత గురజాల చెన్నకేశవులు నాయుడు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు సంక్రాంతి కానుకను అందజేశారు. తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, మాజీ మేయర్ కటారి హేమలత, లత, రాణి, వరలక్ష్మి, నాగలక్ష్మి, శివకుమారి, చిత్ర తదితరులు పాల్గొన్నారు.

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది రోజమ్మా!

మంత్రికి టీడీపీ నేత బండారు సూచన ● నగరి కోర్టుకు హాజరైన సత్యనారాయణమూర్తి



నగరి కోర్టుకు హాజరైన టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణ మూర్తి

నగరి, జనవరి 12: 'మాటలు సక్రమంగా మాట్లాడితే పరవాలేదు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది రోజమ్మా' అంటూ మాజీ మంత్రి, టీడీపీ నేత బండారు సత్యనారాయణ మూర్తి వ్యాఖ్యానించారు. తనను అసభ్యంగా దూషించారంటూ ఆయనపై నగరి జుడిషియల్ కోర్టులో మంత్రి రోజా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు వాయిదాలో భాగంగా శుక్రవారం సత్యనారాయణమూర్తి నగరికి వచ్చారు. కాగా, ఈ కేసును ఫిబ్రవరి 13వ తేదికి వాయిదా వేస్తూ న్యాయమూర్తి విష్ణువర్మ ఆదేశాలిచ్చారు. కాగా, నగరిలో బండారు మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలను లొంగదీసుకోవాలని అక్రమ కేసులతో ప్రభుత్వం వేధిస్తోందన్నారు. తనపైనా పలు చోట్ల కేసులు పెట్టారని గుర్తుచేశారు. వైసీపీ నేతల దుశ్చర్యలపై తాము ఆధారాలతో ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలేదన్నారు. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని బాగుచేయాలన్న దృక్పథంతో ప్రజల వద్దకు వెళుతున్నామని చెప్పారు. ఈ క్రమంలో ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. ఎన్నో కేసుల్లో నిందితుడైన జగన్ 2024 ఎన్నికల తర్వాత చంచలగూడకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. నాయకులు గుణశేఖర్, జ్యోతి నాయుడు, ఖాదర్‌భాయ్ రుక్కుం బాలాజీతో పాటు ఆయన వ్యక్తిగత లాయర్లు, నగరి టీడీపీ న్యాయవాది జగదీష్ పాల్గొన్నారు.

ఈసారైనా ఉంచుతారా.. మళ్లించేస్తారా?

● ఉమ్మడి జిల్లాకు రూ.22.79 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 12: ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని గ్రామపంచాయతీలకు కేంద్రప్రభుత్వం రూ.22.79 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. చిత్తూరు జిల్లాలోని 684 గ్రామపంచాయతీల్లో ఉన్న 14,36,580 మంది జనాభాకు రూ.11,52,29,049, తిరుపతి జిల్లాలోని 745 గ్రామాల్లో వున్న 13,65,904 మంది జనాభాకు రూ.11,27,13,553 విడుదలయ్యాయి. కాగా పొరుగున వున్న అన్నమయ్య జిల్లాలోని 490 గ్రామ పంచాయతీల్లో వున్న 13,51,740 జనాభాకు రూ.11,30,67,187 విడుదల చేసింది. 2022-23 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు మూడు నెలల కిందటే విడుదల కావాలి. కానీ, రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకంతో కేంద్రం జాప్యం చేసింది. గతంలో విడుదల చేసిన 14వ, 15వ తొలివిడత ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఛార్జీల బకాయిలకు మళ్లించింది. దీనిపై నాలుగు నెలలుగా సర్పంచులు తీవ్ర ఎత్తున నిరసన తెలిపారు. చేస్తున్నారు. మరోవైపు తెలుగుదేశం నాయకులు కేంద్రానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వీటిపై కేంద్రం విచారణ జరిపి, నిధుల మళ్లింపు నిజమేనని గుర్తించింది. కాగా, శుక్రవారం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్రప్రభుత్వం ఖాతాలో జమచేసింది. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో నేరుగా వేస్తుందా.. లేదా గతంలో వలే విద్యుత్ బకాయి ఛార్జీల పేరుతో మళ్లిస్తుందా అనేది చర్చనీయాంశమైంది. సాధారణంగా కేంద్రం ఇచ్చిన నిధులను సర్పంచుల అనుమతితో.. పంచాయతీ తీర్మానం చేశాకే ఇతరత్రా వాటికి మళ్లింపులు, ఖర్చులు చేయాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోవడం లేదు.

ముగ్గురు అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యుల అరెస్టు

● 71 గ్రాముల బంగారం స్వాధీనం


నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహబూబ్‌బాష

కలకడ, జనవరి 12:బంగారు నగల చోరీ కేసులో ముగ్గురు అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ మహబూబ్‌బాష తెలిపారు. శుక్రవారం కలకడ పోలీ‌స్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఆగస్టు 10వతేదీన కలకడలోని ఓ నగల దుకాణంలో వస్తువులను కొనడానికి వెళ్లి వ్యాపారిని ఏమార్చి బంగారు గొలుసు, ఉంగరం చోరీ చేశారన్నారు. అదే విధంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, పీటీఎం, రాయచోటి టౌన్ పోలీ‌స్‌స్టేషన్ పరిధిలో మూడు బంగారు గొలుసులు చోరీ అయినట్లు తెలిపారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు నిఘా ఉంచి కలకడ వారపు సంతలో ముఠా సభ్యులను ఎస్‌ఐ తిప్పేస్వామి, సిబ్బంది అరెస్టు చేసినట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రామప్ప వెంకటేష్, మునిప్ప చంద్రశేఖర్, ముద్దప్ప నారాయణస్వామి అను వారు కూలీ పనులు చేసుకొంటూ స్నేహంగా ఉంటున్నట్లు తెలిపారు. వారు చెడు వెసనాలకు బానిసలై చోరీలు చేయడం వృత్తిగా ఎంచుకొన్నారన్నారు. ఈ క్రమంలో దర్యాప్తు చేపట్టి నిందితుల నుంచి 71 గ్రాముల బరువు గల బంగారపు గొలుసులు, ఉంగరాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.4.26 లక్షలు ఉంటుందన్నారు. నిందితులను రిమాండుకు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడిపై పిచ్చి కుక్క వీరంగం...! తలపై తీవ్ర రక్తగాయాలు


గాయపడ్డ బాలుడు

గుర్రంకొండ, జనవరి 12:పిచ్చికుక్క వీరంగం సృష్టించడంతో రిహాన్(4) అనే బాలుడి తలకు తీవ్ర రక్తగాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు గుర్రంకొండ పట్టణంలోని తాళంవీధికి చెందిన రౌనక్ కుమారుడు రిహాన్ ఇంటి ముందర ఆడుకొంటుండగా పిచ్చికుక్క రెండు రోజుల క్రితం దాడి చేసింది. ఈ క్రమంలో బాలుడి తలపై ఇష్టానుసారం గా కరిచింది. దీంతో కుటుంబ సభ్యులు బాలుడ్ని మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం రిహాన్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంద ని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా 20 రోజుల క్రితం గ్రామంలో వీధి కుక్కల దాడిలో సుమారు 10 మందికిపైగా గాయపడ్డారు. ఈ సంఘటన మరువక ముందే బాలునిపై పిచ్చికుక్క దాడి చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకో వాలని ప్రజలు కోరుతున్నారు.

భూతగాదాలతో అరటి తోట నరికివేత

నిమ్మనపల్లి, జనవరి 12: భూతగాదాల కారణంగా ఓ రైతు పండిస్తున్న అరటి, టెంకాయ, మునగ చెట్లను నరికివేసిన సంఘటన మండలంలో చోట చేసుకొంది. మండలంలో రాచివేటివారిపల్లె పంచాయతి గుండ్లబురుజుకు చెందిన రైతు ఉదయ్‌కుమార్ తనకు వారసత్వంగా సంక్రమించిన భూమిలో అరటి, టెంకాయ, మునగ చెట్లను సాగు చేశాడు. కాగా తన భూమిని దున్నుకుంటుండగా అదే గ్రామానికి చెందిన నాగరాజ భూమి వద్దకు వచ్చి భూమి దున్నవద్దు అని బెదిరించడంతో రెండు రోజుల క్రితం అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో శుక్రవారం నాగరాజ అతని కుమారుడు గురుమూర్తులు నలుగురు యువకులు ఉదయ్‌కుమార్ భూమి వద్దకు వచ్చి తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ ట్రాక్టర్‌తో పొలంలో వున్న అరటి, టెంకాయ, మునగ చెట్లను నరికివేయడమే కాకుండా తనను చంపేస్తామని కొడవలితో బెదిరించినట్లు తెలిపారు. అయితే పంటకు వచ్చిన చెట్లను నరికివేయడంతో రైతు ఉదయ్‌కుమార్ బోరున విలపించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాగరాజ, గురుమూర్తి, వారి అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

నిమ్మనపల్లి, జనవరి 12: గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 5మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2080 లను స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ముష్టూరు గ్రామ పంచాయతి దిగువపల్లెకు చెందిన 5మంది గ్రామ సమీపంలో పేకాట ఆడుతుండగా వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

నిమ్మనపల్లి, జనవరి 12: సంక్రాంతి పండుగను సందర్భంగా మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని ఎస్‌ఐ రామక్రిష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎవరైనా కోడి పందేలు, పేకాట వంటి చట్ట వ్యతిరేకమైన పనులు చేపడితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కోడి పందేలు, పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందివ్వాలని ప్రజలను ఆయన కోరారు.

ప్రధాన మంత్రి 15 పాయింట్స్ జిల్లా కమిటీ సభ్యుడిగా ఫిర్దోస్‌ఖాన్



మదనపల్లె టౌన్, జనవరి 12: ప్రధాన మంత్రి 15 పాయింట్స్ జిల్లా కమిటీ సభ్యుడుగా మదనపల్లెకు చెందిన ఎన్.ఫిర్దోస్‌ఖాన్ నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించనున్న ఈ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై మైనారిటీ సంక్షేమం, అభివృద్ధి, సమస్యలపై చర్చిస్తారు. ఇందులో జిల్లా ఎస్పీ నుంచి జిల్లా స్థాయిలో అధికారులతో పాటు ముస్లిం మైనారిటీ, క్రిస్టియన్ మతాలకు చెందిన ముగ్గురిని సభ్యులుగా నియమించారు. ఇందులో మదనపల్లెకు చెందిన ఫిర్దోస్‌ఖాన్ సభ్యుడుగా నియమితులయ్యారు. తనకు ఈ పదవి కేటాయించడంలో కృషి చేసిన ఎంపీ మిధున్‌రెడ్డికి ఫిర్దోస్‌ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంక్రాంతి కానుక పంపిణీ

ములకలచెరువు, జనవరి 12: స్థానిక ఎమ్మార్సీలో పనిచేస్తున్న సమగ్ర శిక్షణ ఉద్యోగులకు శుక్రవారం సంక్రాంతి కానుకను అందజేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సహకారంతో సమగ్ర శిక్షణ ఉద్యోగులకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని ఎంఈవోలు వెంకటరమణ, శంకరయ్యలు అందజేశారు. అనంతరం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. ఆర్థిక సహాయం సమకూర్చేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు అమరనాథరెడ్డి, అనీల్‌కుమార్, రాజారెడ్డి, శ్రీరాములు, జయరాం, ఆనందరెడ్డిలను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు మల్లికార్జున, ఆనందరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవణప్ప, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అడిగితే కక్షసాధింపా..!

● మదనపల్లెలో కళ్లకు గంతలు కట్టుకుని అంగన్వాడీల నిరసనలు ● సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదంటున్న వైనం


మదనపల్లెలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


వాల్మీకిపురంలో నోటీసులను దహనం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

వాల్మీకిపురం, జనవరి 12: అంగన్వాడీలు చేస్తున్న కష్టానికి ఫలితంగా కనీస వేతనాలు ఇవ్వమని కోరితే ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని అంగన్వాడీ కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోయారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం వద్ద సీడీపీవో ద్వారా వచ్చిన నోటీసులను అంగన్వాడీలు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలను తొలగించే దమ్ము, ధైర్యం ప్రభుత్వానికి ఉన్నాయా అని ప్రశ్నించారు. ఓపికతో ఉన్నామని తమ సహనాన్ని పరీక్షించొద్దని హెచ్చరించారు. గత 32రోజులుగా ఎంతో సామరస్యంగా సమ్మె చేపడితే ఇదే అదనుగా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. తమ కనీస డిమాండ్లు పరిష్కరించేదాకా సమ్మె విరమించే ప్రసక్తే లేదన్నారు. ప్రాజెక్టు కార్యాలయంలో ఏమి చేస్తున్నారో తమకంతా తెలునని ఇకపై అధికారుల ఆటలు కూడా సాగనివ్వమన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూ‌కైలేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, రెడ్డిరాణి, దేవసేన, లక్ష్మీనరసమ్మ, వాల్మీకిపురం, కలికిరి, గుర్రంకొండ మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్‌లో: అంగన్వాడీలు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 32 రోజులుగా అరచి కొట్టుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కనపడటం లేదని నేతలు ధ్వజమెత్తారు. దేవుడా..! ఈ ప్రభుత్వానికి కళ్లు తెరిపించి..మా గోడు వినిపించు అంటూ అంగన్వాడీలు నిరసనలు తెలిపారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మదనపల్లె ప్రాజెక్టుకు చెందిన అంగన్వాడీలు కళ్లకు నలుపుగంతలు కట్టుకుని నిరసన తెలిపారు. తాము న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరితే, ఎస్మా ప్రయోగించడం, ఉద్యోగాలు తొలగిస్తామని షోకాజ్ నోటీసులు ఇవ్వడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం అంగన్వాడీలు, సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 32వ రోజుకు చేరుకోగా రిలే నిరాహారదీక్ష ఏడవ రోజుకు చేరుకుంది. తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు, హెల్పర్లు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో సమ్మె శిబిరం వద్ద భైఠాయించి నిరసన తెలిపారు. శుక్రవారం నాడు మంత్రుల కమిటీతో చర్చలు ఉన్న నేపథ్యంలో..ప్రభుత్వం మొండి పట్టు వీడి తమ సమస్యలు పరిష్కరించేలా కరుణించు స్వామి..! అంటూ మల్లయ్యకొండ మల్లికార్జున స్వామికి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. జీతాల పెంపు, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాడ్యుట్ అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు, ఉద్యోగ భద్రత అమలు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కరుణశ్రీ, గౌరి, ఉమా దేవి, సులోచన, సరస్వతి, స్వరూపారాణి, శివమ్మ అంగన్వాడీలు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో : బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు అందరూ చెవులను మూసుకుని నిరసన తెలిపారు. అంగన్వాడీ లీడర్లు శ్రీవాణి, చాందబీ, కుమారిలు మాట్లాడుతూ జీవో నంబర్ 2కు భయపడే ప్రసక్తే లేదన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని ఆపబోమన్నారు. కార్యక్రమంలో బి.కొత్తకోట, ములకలచెరువు, పీటీఎం మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం.. స్వామి వివేకానందుడు


మదనపల్లెలో వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్


పీలేరులో స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మదనపల్లె, అర్బన్, జనవరి 12: యువతకు ఆదర్శం.. స్వామి వివేకానందుడని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని స్థానిక జడ్పీహైస్కూల్‌లోని వివేకానంద విగ్రహానికి మదనపల్లె వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్, పొన్నుగంటి అమరనాథ్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఉపాధ్యక్షుడు వీవీ కృష్ణరావు, కోశాధికారి లక్ష్మీదీపక్, వనితక్లబ్, వాసవీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామీ వివేకానంద జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువజన దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ తరం యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ప్రోగ్రామ్‌ఆఫీసర్ రెడ్డెప్పరెడ్డి, అధ్యాపకులు ఎంవీ నాయుడు, జ్ఞానశేఖర్, వెంకటాచలపతి, లక్ష్మీ, నిర్మలమ్మ, నారాయణరెడ్డి, పరతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో: స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం పీలేరులోని పలు సంఘాలు ఘనంగా నిర్వహించాయి. స్థానిక కోటపల్లె క్రాస్‌లోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాయి. యువజన అవార్డు గ్రహీత రాయల బాబు రాజేంద్రప్రసాద్ స్థానిక శ్రీలక్ష్మీ వృద్ధాశ్రమంలో వేడుకలు నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు బి.చంద్రశేఖర రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరి వెంకటరామయ్య, నాయకులు కంభం నరసింహారెడ్డి, సురేంద్రనాథరెడ్డి, డీసీసీ బ్యాంకు ఎంజీఎం యోగేశ్వర రెడ్డి, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు వసంతాల రాజా, మైనారిటీ నాయకుడు మహబూబ్ బాషా, వీ211ఏ వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ సురేశ్ బాబు, నాయకులు జయచంద్ర, తులసీకృష్ణ, హరి, భరత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం వాల్మీకిపురంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వివేకానందుడి చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, ఏపీఎం నరసింహులు, సీసీలు మహేశ్వరి, శంకరయ్య, గంగులప్ప, శ్రీని వాసులు, భూదేవి, దేవయాని, రజనికుమారి, సంఘమిత్రలు పాల్గొన్నారు.

కురబలకోటలో: యువత వివేకానందుడి స్ఫూర్తితో ముందుకు సాగాలని మోటివేటర్ రామ్మూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో వివేకానందుడి జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత చేతుల్లోనే దేశభవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి కుసుమ, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో: స్వామి వివేకానంద జయంతి వేడుకలను మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. భారతదేశ ఔన్నత్యాన్ని, సాంస్కృతిక సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానందుడని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. నేటి యువత వివేకానంద అడుగు జాడల్లో నడవాలన్నారు.

బి.కొత్తకోటలో : బి.కొత్తకోటలో స్వామి వివేకానందుని 160 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వాకర్స్ ప్రాంగణంలో వేరువేరుగా వివేకానందుని చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారతీయ ధర్మాన్ని, కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తంగా చేసిన ఘనత వివేకానందునికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రామచంద్ర, ఎంఈవో రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ కృష్ణారెడ్డి, సాంబశివయ్య, ప్రసాద్, ప్రభాకర్, మహేష్, సాబ్జి, పవన్, కర్ణ తదితరులు పాల్గొన్నారు.


బి.కొత్తకోటలో..


వాల్మీకిపురంలో..

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మదనపల్లె అర్బన్, జనవరి 12: మదనపల్లె మండలం, బసినికొండ శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద ముందస్తు సంక్రాంతి సంబరాలను మదనపల్లె రాయల్‌యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇందులో 80 మంది ముగ్గుల పోటీల్లో పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేసి బహుమతులు గెలుచుకున్నారు. దీంతో ముందస్తు సంక్రాంతి పండుగ శోభ నెలకొంది. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రేగడి ప్రసాద్‌కుమార్, సుంకర రామచంద్ర, పసుపులేటి వరప్రసాద్, వెంకటాచలపతి, నాగరాజ, శ్రీధర్, మల్లికార్జున, కొండయ్య, గిరిప్రసాద్, చంద్రశేఖర్, లలిత, సుశీల, శ్రీదేవి, శ్యామల, శశికళ, పద్మజా, ఉమాదేవి, రజనీ, భాగ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోండి

మదనపల్లె టౌన్, జనవరి 12: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మంలో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాల ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీవో లక్ష్మీపతి కోరారు. శుక్రవారం మండలంలోని బసినికొండ సచివాలయం వద్ద నిర్వహిస్తున్న రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మాన్ని డీఎల్‌డీవో తనిఖీ చేశారు. ఈ శిబిరంలో చేపడుతున్న ఆరోగ్య పరీక్షలు, చికిత్సల గురించి ప్రజలకు అవగాహన కల్పిం చాలన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యస్థితిని తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రసాద్, సర్పం చ్ రమణ, డాక్టర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పెద్దతిప్పసముద్రం జనవరి 12 : సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వైద్య సిబ్బందితో కలసి మండలంలోని మడుమూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరు డ్రైడేను పాటించాలని ప్రజలకు వివరించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వేను నిర్వహించారు. గ్రామాల్లో యాంటీ లార్వా ఆపరేషన్‌ను చేయాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రామలక్ష్మి, ఆశా కార్యకర్తలు పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

పెద్దమండ్యం, జనవరి 12: అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీధర్‌రావు సూచించారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల అధికారులు, సచివాలయ ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త భవనాల అభివృద్ధి పనులు ఏ దశలల్లో ఉన్నాయో స్పష్టమైన నివేదికలు ఇవ్వాలన్నారు. ఆయా గ్రామాలలో సర్పంచులతో సమావేశాలు నిర్వహించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయడానికి కృషి చేయాలనిచెప్పారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ రాము, ఎంఈవో మనోహర్, రామకృష్ణ, డీటీ గౌరిశంకర్, సర్పంచులు పద్మావతి, విజయకుమారి, జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులను ఎలా నిర్వహిస్తారు?

మదనపల్లె టౌన్, జనవరి 12: సెలవు రోజుల్లో కొన్ని చోట్ల పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఏబీవీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని రెండు ప్రైవేటు పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకుని ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ సాయిహితేష్, సభ్యులతో వెళ్లి అడ్డుకున్నారు. సెలవుల్లో కూడా విద్యార్థులను మానసిక ఒత్తిడి తెస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డీఈవో పురుషోత్తంకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం విద్యార్థులను తరగతుల నుంచి పంపివేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయ కులు రాజు, అభినయ్, శ్రీకాంత్, చక్రపాణి, తేజ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా పీలేరులో రా.. కదలి రా.. సభ


సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జనవరి 12: పీలేరులో జరుగనున్న రా.. కదలి రా.. బహిరంగ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేసేందుకు టీడీపీ శ్రేణులు కదలిరావాలని పీలేరు ఇన్‌చార్జీ నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి కోరారు. శుక్రవారం నగరిపల్లెలో జరిగిన కలికిరి మండల టీడీపీ విస్తృత సమావేశంలో ఈ నెల 24న నిర్వహించనున్న రా..కదలిరా.. సభపై టీడీపీ నాయకులతో ఆయన చర్చించారు. పీలేరు పరిసర సమీప మండలాల్లో కలికిరి కూడా ఒకటని, ఇక్కడి నుంచి మోటారు సైకిళ్ళు, ఆటోలు, కార్లను పూర్తి స్థాయిలో సమీకరించుకోవాలని చెప్పారు. ఉదయం 9 గంటలకు కలికిరి నుంచి సభకు బయలుదేరాలని చెప్పారు. సమావేశం అనంతరం పంచాయతీల వారీగా విడివిడిగా సమావేశమై లక్ష్యాలను నిర్దేశించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్, కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, పార్టీ నాయకులు నిజాముద్దీన్, సతీష్ రెడ్డి, మర్రికుంటపల్లె, పత్తేగడ, గుండ్లూరు, మునేళ్ళపల్లె, సంద్రావారిపల్లె సర్పంచులు రెడ్డిరాము, యల్లయ్య, సైపుల్లా, జాహీదా, ఎంపీటీసీలు కృష్ణయ్య, చిన్నరెడ్డెయ్యతోపాటు అన్ని అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

పాలేగాళ్ల వ్యవస్థను వారసత్వ సంపదగా గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కేశవులు నాయుడు

పీలేరు, జనవరి 12: రాష్ట్రంలోని పాలేగాళ్ల వ్యవస్థను పరిరక్షించి దానిని వారసత్వ సందగా గుర్తించాలని పాలేగాళ్ల వారసుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎనుగొండ కేశవులు నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరు మండలం తలపుల పంచాయతీ అడవిపల్లె వద్దనున్న మద్దుండాల మల్లేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పాలేగాళ్ల వారసుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ, విజయనగర, గోల్కొండ, మొగల్, మరాఠా పాలకుల కాలంలో రాయలసీమ ప్రాంతంలో పాలేగారి వ్యవస్థ స్థానిక పాలనా యంత్రాంగాన్ని సమర్థవంతంగా నిర్వహించిందన్నారు. ప్రముఖ రచయిత, చరిత్రకారుడు తువ్వా ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ పాలేగాళ్ల వ్యవస్థను నిర్వీర్యం చేసిన బ్రిటీషు పాలకులు నాటి పాలేగాళ్లకు పెన్షన్ విధానాన్ని అమలు చేసిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి మరోమారు అధ్యయనం జరిపి పాలేగాళ్ల వారసులకు పెన్షన్ అందించాలన్నారు. కార్యక్రమంలో పాలేగాళ్ల సంఘం నాయకులు గురిగింజకుంట చంద్రప్ప నాయుడు, జోతాల వెంకటరమణ నాయుడు, పందిళ్లపల్లె బలరామయ్య, జె.వెంకటరమణ నాయుడు, టీఎస్ పెద్దరెడ్డప్ప నాయుడు, ప్రభాకర నాయుడు, లక్ష్మీపతి నాయుడు, ఎల్లుట్ల సాంబశివనాయుడు, గుట్టపాళెం రెడ్డప్ప నాయుడు, పార్థసారథి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రియాంకగాంధీ జన్మదిన వేడుకలు


బి.కొత్తకోటలో కేక్ కట్‌చేసి పంచుతున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

మదనపల్లె అర్బన్/బి.కొత్తకోట జనవరి 12: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను మదనపల్లె పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేసి సంబరాలను చేసుకున్నారు. ఈ సందర్భంగా 20మంది నాయకులు, కార్యక్తలు రక్తదానం చేశారు. కాంగ్రెస్ పార్టీలోకి వైఎస్ షర్మిల, నూతన రాష్ట్రఅధ్యక్షుడు మాణిక్యం ఠాగూర్‌లు రావడంతో పార్టీ నాయకులు, యువత ఉత్సాహంగా అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ ఎస్‌కేబాషా, మీనాకుమారి, సురేంద్రరెడ్డి, మహమ్మద్ రఫీ, మహబూబ్‌పీర్, మహమ్మద్ అలీ, నాగరాజ, చలపతి, పాలేటి, సయ్యద్, అన్వర్, ఈశ్వరమ్మ, సమీర్, శంకర, ఖాసీం, సోను, శరత్‌కుమార్‌రెడ్డి, బయ్యారెడ్డి, భానుప్రకాష్ పాల్గొన్నారు. బి.కొత్తకోటలో రాష్ట్ర పార్టీ ప్రధానకార్యదర్శి, తంబళ్లపల్లె కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎంఎన్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జ్యోతి బస్టాండు కూడలిలో కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఊహించని ఫలితాలను సాధిస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్, నేతలు బయ్యారెడ్డి, రాజారెడ్డి, సుధీర్, సురేంద్ర, పాల్గొన్నారు.

జయహో బీసీ సదస్సును విజయవంతం చేయండి


టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న కుడుం శ్రీనివాసులు

బి.కొత్తకోట జనవరి 12 : బి.కొత్తకోట పట్టణంలో ఈ నెల 19న నిర్వహించే జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ పోల్ కోఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ శంకర్‌యాదవ్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ సభకు మండల వ్యాప్తంగా బీసీల సమీకరణకు ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు శుక్రవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీలను ఏకం చేసితమ సత్తా చాటే విధంగా వారిలో రాజకీయ చైతన్యం నింపాలని కోరారు. సమావేశంలో బి.కొత్తకోట క్లస్టర్ ఇన్‌చార్జ్ కనకంటి ప్రసాద్, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ఎండీ మస్తాన్, మాజీ ఉపసర్పంచ్ షమీవుల్లా, సుకుమార్, దేరంగుల నారాయణ, సిద్దప్పనాయుడు, చాకనా రాజా, దేవరింటి కుమార్, దేవుడు నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

నూతనకాల్వకు చెందిన పలువురు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన నూతనకాల్వ నాయకులు

కలికిరి, జనవరి 12: కేవీపల్లె మం డలం నూతనకాల్వ పంచాయతీకి చెందిన పలువురు నాయకులు శుక్రవారం టీడీపీ కండువాలు కప్పుకున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సమక్షంలో ఉదయం నగరి పల్లెలో వారు టీడీపీలో చేరారు. నూతన కాల్వకు చెందిన సూర్య ప్రకాష్‌రెడ్డి, దిన్నెవడ్డెపల్లె రమణారెడ్డి, సుధాకర, మల్లికార్జున తదితరులు పార్టీలో చేరారు. కేవీ పల్లె టీడీపీ నాయకుడు మహేంద్ర రెడ్డి, మహల్ సతీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ- జనసేనలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని చేపడుతున్న టీడీపీ నేతలు

నిమ్మనపల్లి, జనవరి 12: టీడీపీ-జనసేన పార్టీలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాజంపేట అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం రాచివేటివారిపల్లె పంచాయతి బుచ్చిరెడ్డిగారిపల్లెలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర బాబు ముఖ్యమంత్రి కాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500లను వారి ఖాతాకు జమ చేస్తారన్నారు. అదే విధంగా తల్లికి వందనం పేరుతో పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి రూ.15000లు అందిస్తారని, రైతు లకు ఏడాదికి 20వేలు చెల్లిస్తానన్నారు. అదే విధంగా ప్రతి కుటుంబానికి 3సిలిండర్‌లు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, క్రిష్ణమూర్తి, దేవకి, చలపతి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు సరిదిద్దేలా చూడండి


దొంగ ఓట్లపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

వాల్మీకిపురం, జనవరి 12: వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి కోరారు. ఇప్పటికే పలుమార్లు ఓటర్ల జాబితాలో తప్పులు, దొంగ ఓట్ల తొలగింపుపై ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్‌ను కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. మండలంలో వందల సంఖ్యలో మృతులు, డబుల్ ఎంట్రీలు, జీరో డోర్ నెంబర్లల, బయటి ప్రాంతాల వారి పేర్లు ఓటర్ల జాబితాలో అలాగే ఉన్నాయని, అధికారులు తక్షణమే స్పందించకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు రమేష్, నాయకులు కోసూరి చంద్రమౌళి, వల్లిగట్ల వెంకటరమణ, గాంధీపేట రెడ్డి, సాంబ తదితరులు పాల్గొన్నారు.